ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275
# ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 05-06- 2026 సంపుటి: 17, సంచిక: 62, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

# పనుల్లో జాప్యం వద్దు

## మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన



**ఫోటో ఎగ్జిబిషన్, ప్రాజెక్టు మ్యాప్స్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి**

**పంప్ హౌస్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను ప్రశ్నించిన సీఎం**

**కాంక్రీటు పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశం**

**మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన**

గద్వాల జిల్లా ప్రతినిధి జూన్ 4 (ప్రజా కలం న్యూస్)

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి రంగాన్ని బలోపేతం చేయడంలో కీలకంగా భావిస్తున్న మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎంఎన్‌కేఎల్ఐఎస్) పనుల పురోగతిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బెంగుళూరు నుంచి నేరుగా నారాయణపేట జిల్లా మక్తల్‌కు చేరుకున్న ఆయన, ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌తో పాటు ప్లాన్ మ్యాప్స్‌ను పరిశీలించి అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ముందుగా ప్రాజెక్టు లక్ష్యాలు, పనుల ప్రస్తుత స్థితి, నిర్మాణ దశలు, భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన వివరాలను ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా పరిశీలించారు. ప్రాజెక్టు పూర్తయిన అనంతరం సాగునీరు అందనున్న ప్రాంతాలు, రైతులకు కలిగే ప్రయోజనాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. పనుల అమలులో నాణ్యత, వేగం రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న ఎత్తిపోతల పథకం ప్యాకేజీ--1 పనుల ప్రాంతానికి చేరుకుని ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యంగా పంప్ హౌస్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను ప్రశ్నించి, ఇప్పటివరకు ఎంత మేరకు పనులు పూర్తయ్యాయో తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.

తరువాయి 2వ పేజీలో...



## రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

**కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు**

**ఇప్పటికే నాలుగు ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన**

**రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదు**

**సందేహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 4788**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్, జూన్ 4 (ప్రజాకలం) :

తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలోని తాలిమ్ లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయ నిర్మాణ పనులను గురువారం నాడు మంత్రి గారు పరిశీలించారు. అంతకుముందు సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఏమాత్రం లేదని మంత్రి గారు స్పష్టంచేశారు. గత బీ.ఆర్.ఎస్. ప్రభుత్వం 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచింది.

తరువాయి 2వ పేజీలో...

## తెలంగాణలో ప్రజావంచక పాలన

**కాంగ్రెస్ కు రోజులు దగ్గర పడ్డాయ్ - కార్మికుడిపై భారం తగ్గాలన్నదే బీఆర్ఎస్ ఆలోచన**

**రెండున్నరేళ్లలో పీఆర్సీపై ప్రకటన లేదు - జలమండలి కార్మిక సంఘం ఎన్నికల సమావేశం**

హైదరాబాద్, జూన్ 4 (ప్రజాకలం) :

గతంలో లంచాలు లేకుండా ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పదోన్నతులు జరిగేవని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు గేట్ మీటింగ్ లో హరీశ్ రావు ప్రసంగించారు. సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రశ్నించే గొంతు కావాలన్నారు. ఏడాది క్రితం పటాన్ చెరువులోని సిగాచి పరిశ్రమలో బాయిలర్ పేలి కార్మికులు చనిపోయారని హరీశ్ రావు గుర్తుచేశారు. మృతి చెందిన కార్మికులకు రూ. కోటి పరిహారం ఇస్తామని చెప్పి ఏడాది గడిచిందని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు అండగా ఉండి న్యాయం జరిగేలా చూస్తామని హరీశ్ రావు హామీ ఇచ్చారు. రేవంత్ సర్కార్ రైతులకు రుణమాఫీ, రైతుబంధు ఎగ్గొట్టారని మండిపడ్డారు.

**తెలంగాణలో ప్రజా వంచకపాలన**

తెలంగాణలో ప్రజా వంచకపాలన నడుస్తోందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. రెండున్నరేళ్లలో పీఆర్సీపై ప్రకటన లేదని ఆయన మండిపడ్డారు. జూన్ 2న ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తే.. నిరాశే ఎదురైందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరు డీఏలు



పెండింగ్ పెట్టారని ధ్వజమెత్తారు. జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, సింగరేణి కార్మికులకు ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి ఆరోపించారు. గతంలో తాము 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశామని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతును గెలిపిస్తే.. సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. మూడు కార్పొరేషన్ల చేసిన ఎవీజౌ మాత్రం అలాగే ఉందన్నారు. మూడు కార్పొరేషన్లు పెరిగితే ఎవీజౌ కార్మికులను ఎందుకు పెంచరు? అని ప్రశ్నించారు. కార్మికుడిపై భారం తగ్గాలన్నదే బీఆర్ఎస్ ఆలోచన.. కాంగ్రెస్ కు రోజులు దగ్గర పడ్డాయని హరీశ్ రావు ఎద్దేవా చేశారు అన్నారు.

## తెలంగాణలో ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్




### 10 మంది డ్రగ్ పెడ్లర్లు అరెస్ట్

**హైడ్రోపోనిక్ గంజాయి సరఫరా ముఠా గుట్టురట్టు**

**నిందితుల నుంచి రూ.12 కోట్ల గంజాయి స్వాధీనం**

**మహిళతో పాటు 10 మంది గంజాయి పెడ్లర్లు అరెస్ట్**

**థాయిలాండ్ నుంచి ఇండియాకు గంజాయి**

హైదరాబాద్, జూన్ 4 (ప్రజాకలం) :

అంతర్జాతీయ హైడ్రోపోనిక్ గంజాయి స్మగ్లిం గ్ ముఠాను తెలంగాణ ఈగల్ ఫోర్స్ గురువా రం ఛేదించింది. థాయిలాండ్ నుంచి భారత్‌కు అక్రమ రవాణా చేస్తున్న డ్రగ్స్ దందాను గుట్టురట్టు చేసింది. పోలీసులు, కస్టమ్స్ అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఈ మెరుపు దాడిలో అంతర్జాతీయ మార్కెట్లో సుమారు రూ. 12 కోట్ల విలువైన అత్యంత ఖరీదైన హైడ్రోపోనిక్ గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ప్రధాన సూత్రధారితో పాటు మొత్తం 16 మంది డ్రగ్ పెడ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈగిల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య వివరాలను వెల్లడించారు. విచారణలో, ఈ సిండికేట్ ముంబైకి చెందిన పాత అండర్వరల్ గ్యాంగ్లకు చెందిన షార్ప్ షూటర్లతో సహా ఇతర గ్యాంగ్ సభ్యులను నియమించుకున్నట్లు వెల్లడైంది. ప్రధాన సూత్రధారి ముంబైకి చెందిన హేమంగ్ ప్రమోద్ కెలుస్కర్‌గా తేల్చింది. అతని సోదరుడుతో కలిసి థాయిలాండ్‌లో క్లబ్ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు, ఈ క్లబ్ కేంద్రంగా డ్రగ్స్ స్మగ్లింగ్ సాగినట్లు వెల్లడించారు. ఈ సిండికేట్‌కు థాయిలాండ్, హైదరాబాద్, ముంబై కేంద్రాలుగా భారీ నెట్‌వర్క్ ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. సుమారు 300 మంది క్యారియర్లను ఉపయోగించి, థాయిలాండ్ నుంచి భారత్‌కు హైడ్రోపోనిక్ గంజాయిని తరలించి, హైదరాబాద్, ముంబై, గుజరాత్ తదితర నగరాల్లో విక్రయించినట్లు వెల్లడించారు. ఈ గంజాయ్‌ని విదేశాల నుంచి

తరువాయి 2వ పేజీలో...

## తెలంగాణ పోలీస్ అకాడమీ దేశంలోని అత్యుత్తమ పోలీసు శిక్షణా సంస్థలలో ఒకటి

**ప్రతిఏటా "తెలంగాణ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్ ఇన్ పోలీస్"కార్యక్రమం**

**తెలంగాణ పోలీస్ అకాడమిని సందర్శించిన డీజీపీ సివి ఆనంద్**

### కలం కౌంటర్






హైదరాబాద్, జూన్ 4 (ప్రజాకలం) :

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్, హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీను సందర్శించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్ట్ డీజీపీ కి స్వాగతం పలికారు.

తరువాయి 2వ పేజీలో...

## కేరళంలోకి నైరుతి రుతుపవనాలు

**వారం రోజుల్లో తెలంగాణలోకి..**

**మూడు రోజులు ఆలస్యంగా ప్రవేశం**

**జూలై మధ్య నాటికి దేశమంతా విస్తరణ**

**ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం**

హైదరాబాద్, జూన్ 4 (ప్రజాకలం) :

మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజానీకానికి చల్లని కబురు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు కేరళంలోకి ప్రవేశించాయి. మరో వారం రోజుల్లో ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం



తరువాయి 2వ పేజీలో...

## ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతాం


**తెలంగాణకు బీజేపీ అనుకూలం..- కృష్ణా జలాల్లో మనకు అన్యాయం**

**కేసీఆర్ సంతకం పెట్టడం తొందరపాటే**

**ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతాం, ప్రజల్లోకి వెళ్తాం: రామచందర్ రావు**

హైదరాబాద్, జూన్ 4 (ప్రజాకలం) :

తెలంగాణకు భారతీయ జనతా పార్టీ అనుకూలమని మొదటినుంచే చెప్పిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గురువారం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో తెలిపారు. బీజేపీ మద్దతు వల్లే లోక్ సభలో యూపీఏ ప్రభుత్వం బిల్లు ప్రవేశ పెట్టిందని గుర్తుచేశారు. ఉన్న ఇద్దరు బీఆర్ఎస్ ఎంపీలు కూడా లోక్ సభలో ఓటింగ్ కు హాజరుకాలేదని తెలిపారు.




తరువాయి 2వ పేజీలో...

# పనుల్లో జాప్యం వద్దు

మొదటి పేజీ తరువాయి...

ప్రస్తుతం కొనసాగుతున్న భూగర్భ, సివిల్ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, కాంక్రీటు పనులను వెంటనే ప్రారంభించి నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ప్రాంతీయ అభివృద్ధికి, రైతాంగ సంక్షేమానికి ఎంతో కీలకమని పేర్కొంటూ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, కర్ణాటక మాజీ మంత్రి ఎన్.ఎస్. బోసెరాజు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

**నెట్టెంపాడుపై సీఎం దృష్టి**

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మరోసారి స్పష్టం చేస్తూ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు నీటి పారుదల ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాలో సుడిగాలి పర్యటన నిర్వహించిన ముఖ్యమంత్రి, సాగునీటి వనరుల అభివృద్ధి, ప్రాజెక్టుల పురోగతి, పనుల నాణ్యతపై అధికారులతో విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ముందుగా మక్తల్ – నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించి, నిర్మాణాల పురోగతి, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, పూర్తి చేయాల్సిన గడువులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కోయిల్ సాగర్ ప్రాజెక్టు, భీమా మరియు కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల నిర్మాణ ప్రాంతాలు, అలాగే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యామ్ సైట్‌ను ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే అవకాశాలపై అధికారులతో చర్చించారు. తదుపరి జోగులాంబ గద్వాల జిల్లా ధారూర్ మండలం గూడెందొడ్డి గ్రామానికి చేరుకున్న ముఖ్యమంత్రి, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న స్టేజ్–1 పంప్‌హౌస్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రగతి, పంపుల సామర్థ్యం, విద్యుత్ సరఫరా వ్యవస్థ, భద్రతా ప్రమాణాలపై నీటి పారుదల శాఖ అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ రూపొందించిన నెట్టెంపాడు ప్రాజెక్టుకు సంబంధించిన లఘు చిత్రాన్ని ముఖ్యమంత్రి వీక్షించారు.

ప్రాజెక్టు ద్వారా లబ్ధి పొందే సాగు విస్తీర్ణం, రైతులకు కలిగే ప్రయోజనాలు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై అధికారులు సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి రైతాంగానికి పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతాం

మొదటి పేజీ తరువాయి...

బిల్లు ఓటింగ్ సమయంలో బీజేపీ ఎంపీలంతా హాజరుకావాలని తమ పార్టీ విప్ కూడా జారీ చేసిందని చెప్పారు. 12 ఏళ్లు గడిచినా.. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని దుస్థితి రాష్ట్రంలో ఉందని పేర్కొన్నారు. తెలంగాణ సాధనలో అందరి పాత్ర ఉంది.. ప్రజల పాత్ర ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో తెలంగాణ ఉద్యమం సాగిందని రామచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ వచ్చాక ఉద్యోగ నియామకాల లక్ష్యం నెరవేరలేదని పేర్కొన్నారు. చివరికి రాష్ట్రం కోసం పోరాడిన విద్యార్థులపై నే కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా ఏళ్లుగా యూనివర్సిటీలు పార్ట్ టైమ్ ఫ్యాకల్టీతో నడుస్తున్నాయన్నారు. మిగులు నిధులు రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పాలన అప్పులపాలు చేసిందని చెప్పారు. బెనిఫిట్స్ అందక 60 మంది విశ్రాంత ఉద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ. 20 వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలకే కేసీఆర్ సంతకం పెట్టడం తొందరపాటే అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రాజెక్టులు–నీళ్లపై ఓ విధానం లేదని రామచందర్ రావు వెల్లడించారు. కృష్ణా జలాల్లో మనకు అన్యాయం జరిగేలా కర్నాటకకు సహకరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఎన్నో ప్రాజెక్టులు, నిధులు ఇస్తోందన్నారు. తెలంగాణకు కేంద్రం రూ. 13 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందని బీజేపీ చీఫ్ వెల్లడించారు. ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో ఎందుకు అమలు చేయట్లేదు? అని ప్రశ్నించారు. ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అవకాశమిచ్చారు. ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని తెలంగాణ ప్రజలు నిర్ణయానికి వచ్చారని రామచందర్ రావు పేర్కొన్నారు. స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి మంచి ఫలితాలు వచ్చాయని సూచించారు. గత నెలలో నరేంద్ర మోదీ సభకు తాము ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వచ్చిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై మరింతగా పోరాడుతాం, ప్రజల్లోకి వెళ్తామని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ ఉత్తర తెలంగాణలోనూ ఆదరణ కోల్పోయిందన్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు దాదాపు మర్చిపోయారని జోస్యం చెప్పారు. అన్ని జిల్లాల్లో బీజేపీకి ఓట్ల శాతం పెరిగిందని వెల్లడించారు.

## తెలంగాణ పోలీస్ అకాడమీ దేశంలోని

# అత్యుత్తమ పోలీసు శిక్షణా సంస్థలలో ఒకటి

మొదటి పేజీ తరువాయి...

గౌరవ వందనం తర్వాత డీజీపీ అకాడమీలోని యూనిట్ ఆసుపత్రి, పరిపాలనా విభాగం, ఆడిటోరియం, తరగతి గదులు, మెస్‌లు, క్రీడా భవన్, ఫైరింగ్ రేంజ్, పరేడ్ గ్రౌండ్ తదితర ముఖ్య భవనాలు, శిక్షణా సదుపాయాలను పరిశీలించారు. ఆ తర్వాత సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అకాడమీలో నిర్వహిస్తున్న ఇండక్షన్ మరియు ఇన్ సర్వీస్ శిక్షణా కార్యక్రమాలు, సిలబస్, సంస్థాగత బాధ్యతలు, మౌలిక వసతులు, భవన సదుపాయాలు, నిర్వహించిన వర్క్‌షాప్‌లు మరియు సెమినార్‌లు, సంక్షేమ కార్యక్రమాలు, అలాగే అకాడమీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సమగ్ర వివరాలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అధికారులు మరియు సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించిన సి.వి. ఆనంద్, అకాడమీలో శిక్షణ అందిస్తున్న అధికారులను అభినందిస్తూ, రాజా బహదూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ దేశంలోని అత్యుత్తమ పోలీసు శిక్షణా సంస్థలలో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. పోలీసు శిక్షణలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలంటే అధికారులు, సిబ్బంది మధ్య టీమ్ వర్క్ , సమన్వయం మరియు సంస్థాగత స్ఫూర్తి ఎంతో అవసరమని ఆయన చెప్పారు. దేశంలోని ప్రముఖ శిక్షణా సంస్థలలో ఒకటైన ఔమిలో తన సేవల్ని గుర్తుచేసుకుంటూ, ప్రొఫెషనల్ పోలీసింగ్‌లో శిక్షణ యొక్క కీలక ప్రాధాన్యాన్ని డీజీపీ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ ట్రైనింగ్ సెంటర్లు, జిల్లా శిక్షణా కేంద్రాలు మరియు ఇతర శిక్షణా సంస్థలను మౌలిక వసతులు మెరుగు పరచడం ద్వారా మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. శిక్షణా కార్యక్రమాల సమర్థవంతమైన నిర్వహణకు అవసరమైన అనుమతులు, ఇతర సంస్థాగత అవసరాల విషయంలో చీఫ్ ఆఫీస్ నుంచి పూర్తి సహకారం అందిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. అన్ని ర్యాంక్స్ కు చెందిన పోలీసు సిబ్బందికి తప్పనిసరి శిక్షణా కోర్సులను క్రమబద్ధంగా నిర్వహించి, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా నొక్కి చెబుతూ, ఇందుకు చీఫ్ ఆఫీస్ నుంచి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందజేయబడతాయని పేర్కొన్నారు. అలాగే, మాదకద్రవ్యాల నియంత్రణ అమలు, సైబర్ నేరాల దర్యాప్తు, మోటారు వాహనాల చట్టం అమలు, రోడ్డు భద్రత మరియు ఈ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి వాటి పై ప్రత్యేక దృష్టి సారించాలని అకాడమీ అధికారులకు డీజీపీ సూచించారు. తద్వారా కార్యాచరణ పరమైన పోలీసింగ్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. తెలంగాణ పోలీస్ అధికారుల రిట్రీట్ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో నిర్వహిస్తామని డీజీపీ ప్రకటించారు. అలాగే, మహిళా సిబ్బందికి సంబంధించి సంస్కరణలు, సమగ్ర భాగస్వామ్యం సంస్థాగత మద్దతు వ్యవస్థలను మరింత బలోపేతం చేయడానికి “తెలంగాణ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్ ఇన్ పోలీస్” కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమీకి చెందిన సీనియర్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

మొదటి పేజీ తరువాయి...

ఒక్క శాతం పెంచిన కూడా వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుందనే ఆలోచనతో ప్రజాకోణంలో నిర్ణయం తీసుకొని వాస్తవానికి దగ్గరగా శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువలను సవరించామని తెలిపారు. ఎలాంటి అక్రమాలకు తావు ఇవ్వకూడదన్న ఆలోచనతో సబ్ రిజిస్ట్రార్ ల అధికారాలను కుదించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలల్లో వ్యవసాయ భూముల విలువ ఎకరానికి కనీసం 2.75 లక్షలుగా నిర్ణయించామని, మున్సిపల్ కార్పొరేషన్ లలో ఎకరానికి 5 లక్షలుగా, హెచ్.యం.డి.ఏ. పరిధిలో 10 లక్షలుగా, ఓ.ఆర్.ఆర్. పరిధిలో 15 లక్షలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. సవరించిన భూములు విలువలపై ఎక్కువ తక్కువలుంటే సమీక్షిస్తామని తెలిపారు. సవరించిన భూముల విలువలు, సందేహాలు ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 4788, వాట్స్ యాప్ నెంబర్ 8247619983 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఏ ఫైల్ పై గుడ్డిగా సంతకం పెట్టలేదు. నేను ఏ తప్పు చేయలేదు.

మంత్రుల శాఖల మార్పుపై విలేఖరులు అడిగిన ప్రశ్నకు మంత్రి గారు స్పందిస్తూ “తాను సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని. దేవుడి దయతో ఇంతవరకు వచ్చాను. నాకు ఏ శాఖ ఇచ్చినా మన స్ఫూర్తిగా పనిచేస్తాను. నేను ఏ తప్పు చేయలేదు. తప్పు చేసే వ్యక్తిని కాను. ఏ ఫైల్ పై గుడ్డిగా సంతకం పెట్టలేదు. చట్ట ప్రకారం పనిచేస్తున్నాను. రెవెన్యూ శాఖలో అక్రమాలకు పాల్పడ్డవారిపై, ఎ.సి.బీ. ట్రాప్ అయిన వారిపై గత ప్రభుత్వంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. విచారణ జరగకుండా తప్పు చేసిన వారిని తప్పించే ప్రయత్నం చేశారు. మూడు, నాలుగు సంవత్సరాలపాటు ఫైళ్లను తొక్కిపెట్టారు. నేను రెవెన్యూ శాఖ మంత్రిగా భాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 3,500 ఫైళ్లను క్లియర్ చేసాను. తప్పు చేసిన వారికి శిక్ష పడే విధంగా నిర్ణయాలు తీసుకున్నాను. ఎవర్ని క్షమించలేదు, ఉపేక్షించలేదు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు 10 సంవత్సరాలు గడిచిన కూడా ఆ నాటి ప్రభుత్వంలో కనీసం జవాబులు ఇవ్వలేదు. అడిగిన సభ్యుల పదవి కాలం కూడా ముగిసింది. ఇటీవల అన్నీ ఫైళ్లను క్లియర్ చేశాను. గత ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ జరిగిన అసైన్డ్ భూములను ఇప్పుడు నిషేదిత జాబితాలో పెట్టడం జరిగింది. భూములకు సంబంధించిన ప్రతీ డాక్యుమెంట్ ను డిజిటలైజేషన్ చేస్తాం.

ఫ్యూచర్ సిటీ రద్దుచేయడం సాధ్యంకాదు. ఫ్యూచర్ సిటీ లో లాండ్స్ ఫ్రీగా ఇవ్వడం లేదు. రద్దు చేస్తే ప్రభుత్వం డబ్బు తిరిగి ఇవ్వవలసి ఉంటుంది. ఇది సాధ్యమయ్యే పనికాదు.

ప్రజలకు పారదర్శకమైన, అవినీతి రహిత సేవలు అందించేందుకు స్టాంప్స్ ఉ రిజిస్ట్రేషన్స్ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చాం. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా సమయాన్ని ఆదా చేయడమే కాకుండా అత్యాధునిక సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నాం.

మొదటి దశ లో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నాం. నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలకే అప్పగించాం. మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాం. వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజీ హాల్, గర్భిణీలకు, వృద్ధులకు ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం తదితరాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే నాలుగు ఇంటిగ్రేటెడ్ భవానలకు శంకుస్థాపన చేసుకొని పనులు ప్రారంభించాం. ఈ గచ్చిబౌలి లో నిర్మిస్తున్న భావనాన్ని డిసెంబర్ లోగా అందుబాటులోకి తీసుకోస్తాం. ఒకటి, రెండు రోజుల్లో కోహెడలో శంకు స్థాపన చేయబోతున్నాం. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తాం. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం విజయమంతమైది. నిరుపేదల స్వంత ఇంటి కలలను తీర్చే అవకాశం నాకు దక్కింది. ఇది నాకు చాలా తృప్తినిచ్చింది. ప్రారంభంలో ఎన్ని వత్తిడిలు వచ్చినా కూడా వెనుకకు తగ్గలేదు. దాని ఫలితమే ఇప్పుడు కనిపిస్తుంది.

## తెలంగాణలో ఈగల్ టీమ్

# భారీ ఆపరేషన్

మొదటి పేజీ తరువాయి...

ప్రత్యేక బ్యాగులలో ప్యాక్ చేసి, వివిధ విమానాశ్రయాల ద్వారా ఎవరికీ అనుమానం రాకుండా నగరానికి స్మగ్లింగ్ చేసేవారు. అలా తీసుకొచ్చిన ఖరీదైన గంజాయిని హైదరాబాద్‌లోని స్థానిక సబ్–పెడ్లర్లకు విక్రయిస్తూ, వారి ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన యువతకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 2026 ఏప్రిల్ 8 నుంచి ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ఫోర్స్మెంట్ (ఈగిల్ ఫోర్స్) నిందితులను అరెస్టు చేసింది.

విశ్వసనీయ సమాచా రం మేరకు, ఈగిల్ ఫోర్స్ ఏప్రిల్ 8న ఇక్కడికి సమీపంలోని రామచంద్రపురంలో ఇద్దరు నిందితులను తొలుత అరెస్టు చేసి, రూ.12.7 కోట్ల విలువైన 12.739 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకుంది.

విచారణలో, ఇద్దరు నిందితులు బ్యాంకాక్, హైదరాబాద్, ముంబైల మధ్య నడుస్తున్న డ్రగ్స్ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌తో ఉన్న లింకులను వెల్లడించడంతో పాటు, పరారీలో ఉన్న తమ ఇతర సహచరుల పేర్లను కూడా తెలిపారు. దీంతో ఈ డ్రగ్ కార్టెల్ ప్రధాన సూత్రధారి హేమాంగ్ కెలుస్కర్‌ను అరెస్టు చేశామని ఈగిల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. ఈగిల్ ఫోర్స్ నిరంతరం నిఘా ఉంచి హేమాంగ్ కెలుస్కర్‌ను అరెస్టు చేసిందన్నారు. ఈ సిండికేట్‌లో ముంబైకి చెందిన పాత అండర్‌వరల్డ్ ముఠాలకు చెందిన కొందరు సభ్యులు ఉన్నారని వెల్లడించారు. చెల్లింపులన్నీ నగదు రూపంలోనే స్వీకరించబడ్డాయన్నారు. ఈ ఆదాయాన్ని హవాలాగా తిరిగి థాయ్‌లాండ్‌కు మళ్లించి, మళ్లీ పెట్టుబడిగా పెట్టారని తెలిపారు. దర్యాప్తులో 88 మంది కొరియర్ల పేర్లను గుర్తించారు. వీరు బ్యాంకాక్‌కు, అక్కడి నుంచితిరిగి మొత్తం172 పర్యాయాలు ప్రయాణించినట్లు వెల్లడైంది. బ్యాంకాక్‌లో కిలో రూ.3లక్షల చొప్పున కొనుగోలు చేసి, భారత్‌లో రూ.70 లక్షల నుంచి రూ.1 కోటి మధ్య విక్రయించినట్లు ఈగల్ డైరెక్టర్ తెలిపారు.

**ఒక్కో ట్రిప్‌నకు రూ.20,000**

ఇప్పటివరకు జరిపిన దర్యాప్తులో ముం బై, అమ్రేలి, సూరత్, జబల్పూర్, రాంచీ, లుధియానా, హైదరాబాద్‌కు చెందిన 29 మంది డ్రగ్ కొరియర్లను ఉపయోగించుకున్నారని, వారిని డీఆర్ఐ, కస్టమ్స్ అధికా రులు పట్టుకున్నారని తెలిసింది.

వారు అక్టోబర్ 2023 నుంచి సుమారు రూ.200 కోట్ల నుంచి రూ. 250 కోట్ల విలువైన 250 కిలోల ఓజీ గంజాయిని తీసుకువచ్చి ఉంటారని ఈగల్ డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ డ్రగ్స్ ముఠా, థాయిలాండ్ నుంచి గంజా యి రవాణా చేసేందుకు తెలంగాణకు చెం దిన 14 మంది యువకులను ఒక్కో ట్రిప్‌నకు రూ.20,000 ఇస్తామనే ఆశ చూపి నియమించుకుం దని స్పష్టం చేశారు. వారు 21 సార్లు ఓజీ కుష్‌ను తీసుకువచ్చారని ఆయన వెల్లడించారు. ఆ 14 మందిలో 12 మందిని అరెస్టు చేశారు. ఒక్కో ట్రిప్‌నకు ఆరు కేజీల చొప్పున లెక్కించినా, వారు రూ.100 కోట్ల నుంచి రూ.120 కోట్ల విలువైన 120 కేజీల ఓజీ కుష్‌ను తీసుకువచ్చి నట్లేనని చెప్పారు.

## కేరళంలోకి నైరుతి

# రుతుపవనాలు



మొదటి పేజీ తరువాయి...

ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. జూలై మధ్య నాటికి దేశంలోని మెజారిటీ ప్రాంతాలకు విస్తరిస్తాయని పేర్కొంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి రుతుపవనాల రాక మూడు రోజులు ఆలస్యమైంది. కాగా, రుతుపవనాల ప్రభావంతో కేరళం లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అటు, తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది.

**దశల వారీగా దేశమంతటికీ..**

కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు రాబోయే రోజుల్లో దశలవారీగా దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాయి. జులై మధ్య నాటికి దేశం మొత్తాన్ని కమ్ముకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే కొన్ని వారాల పాటు ఇవి ఎంత వేగంగా ముం దుకు సాగుతాయనేది చాలా కీలకంగా మారనుంది.

**ముంబైలో ముందస్తుగానే..**

మరోవైపు ముంబై నగరంలో ముందస్తు వర్షాలు మొదలయ్యాయి. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దాదర్, మాటుంగా, అంధేరి వంటి ప్రాంతాలలో రహదారులపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ ఏడాది ముంబైలో రుతుపవనాల కాలంలో 4.5 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో 24 సార్లు హైటైడ్స్ (సముద్రపు అలల ఉధృతి) వచ్చే అవకాశం ఉందని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) హెచ్చరించింది. జూన్ 14 నుంచి 19వ తేదీ వరకు మొదటి విడత అలల ఉధృతి ఉంటుంది. జూలై 16 నాడు ఈ సీజన్లోనే అత్యంత గరిష్టంగా 4.89 మీటర్ల ఎత్తులో అలలు ఎగసిపడవచ్చు. ఈ సమయంలో ప్రజలు బీచ్లు, సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారులు స్పష్టం చేశారు.

**సూపర్ ఎల్‌నినో ముప్పు**

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్–సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90% వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. 92 శాతం వర్షాలు పడుతాయని ఏప్రిల్ నెలలో ఐఎండీ అంచనా వేసినప్పటికీ ఇప్పుడు దాన్ని 90 శాతానికి తగ్గించారు. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబరులో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని వివరించింది. గత 20 ఏళ్లలో ఎల్‌నినో వచ్చిన ఆరు సందర్భాల్లో దేశంలో కరువు పరిస్థితులు లేదా తక్కువ వర్షపాతం నమోదైంది.

**75 శాతం వర్షాలు నైరుతి ద్వారానే..**

దేశవ్యాప్తంగా కురిసే మొత్తం వర్షాలలో 75 శాతం వాటా నైరుతి రుతుపవనాల ద్వారానే వస్తుంది. దేశంలోని సగానికి పైగా వ్యవసాయ భూములు ఈ వర్షాలపైనే ఆధారపడి ఉన్నాయి. వర్షాలు తగ్గితే ఖరీఫ్ సాగు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చెరకు పండించే వర్షాధార ప్రాంతాలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పంటల దిగుబడి తగ్గి ఆహార పదార్థాల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, స్థానిక ఉపాధిని దెబ్బతీస్తుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

**ఆలస్యానికి కారణాలు**

నైరుతి రుతుపవనాలు మే 26వ తేదీనే కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని తొలుత భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. కానీ, ఈసారి పశ్చిమ పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడంతో వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకున్నాయి. లక్షద్వీప్ పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కూడా రుతుపవనాలను నెమ్మదింపజేసింది. ఈ కారణాల వల్ల రుతుపవనాల రాక ఆలస్యమైనట్లు ఐఎండీ పేర్కొంది.

**5 రోజులు భారీ వర్షాలు**

రాష్ట్రంలో శుక్రవారం నుంచి రాబోయే ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురువనున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు గంటకు 50 కి.మీ.ల వేగంతో కూడిన వర్షాలు కురువనున్నాయి. శుక్రవారం రాష్ట్రంలోని సంగారెడ్డి, కామారెడ్డి, కరీంనగర్, జనగాం జిల్లాలలో భారీ వర్షాలు కురవనున్నాయి. శనివారం రంగారెడ్డి, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురవనున్నాయి. ఆదివారం జయశంకర్ భూ పాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, న ల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కురుస్తాయి.

ఢిల్లీలో భారీ వర్షం

న్యూఢిల్లీ, జూన్ 4: దేశ రాజధాని ఢిల్లీ లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం దంచికొట్టింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన ఈ వర్షం వల్ల ఇన్నాళ్లూ భానుడి భగభగలతో అల్లాడిన ప్రజలకు తీవ్రమైన ఎండల నుంచి పెద్ద ఉపశమనం లభించింది. వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) దేశ రాజధానికి రెడ్ అలర్ట్ ప్రకటించింది. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ ఆకాశం ఒక్కసారిగా చీకటిగా మారిపోయింది. ఆ తర్వాత బలమైన గాలులతో కూడిన భారీ వర్షం నగరంలోని పలు ప్రాంతాలను ముంచెత్తింది. వాతావరణ పరిస్థితులు వేగంగా మారిపోవడంతో వాతావరణ శాఖ అంతకుముందు ఇచ్చిన ఎల్లో అలర్ట్‌ను రెడ్ వార్నింగ్‌గా మార్చింది. ఢిల్లీతో పాటు పొరుగున ఉన్న నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్, గురుగ్రామ్ ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. పలు చోట్ల వర్షం రాకముందే భారీ ఈదురు గాలుల వల్ల ధూళి, తుఫాను లాంటి పరిస్థితులు కనిపించాయి. ఈ దాడుల సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, కొన్నిసార్లు గరిష్టంగా 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచాయి. ఈ వర్షాల వల్ల నగరంలో గురువారం గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కాగా, కనీస ఉష్ణోగ్రత 29.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

# సర్కారు బడిలోనే మెరుగైన విద్య




రుద్రంగి, జూన్ 04, (ప్రజాకలం ప్రతినిధి)

సర్కారు బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా మెరుగైన విద్య అందుతున్నదని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామ యువత అన్నారు. గురువారం మండలంలోని మానాల గ్రామంలోని గ్రామ యువత బడిబాట పట్టారు. ఈ సందర్భముగా గ్రామంలో ర్యాలీ తీసి అనంతరం కరువు పని చేస్తున్న కూలీల వద్దకు వెల్లి బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వేడుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులతో పాటు ఇంగ్లీష్ మీడియం విద్యా బోధనను అందిస్తుందన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర శంకర్, ఉప సర్పంచ్ దాసరి అశోక్, లక్కాకుల రమేష్, సిద్ధపెల్లి మురళి, జక్కు మోహన్, తూం రవీందర్, బాదనవేని రాజారాం, లక్కాకుల శ్రీనివాస్, బుర్ర తిరుపతి గౌడ్, జక్కు గంగాధర్, ప్రధాన ఉపాద్యాయుడు రామక్రిష్ణ , భుక్య తిరుపతి, నవీన్, గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# సాజిద్ కుటుంబానికి జిల్లా ఐజేయు నేతల పరామర్శ

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 4(ప్రజా కలం) టి యు డబ్ల్యు జే (ఐజేయు) జగిత్యాల కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా తండ్రి మృతి పట్ల టి యు డబ్ల్యూ జే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు చీటీ శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. గత వారం రోజుల క్రితం వారి తండ్రి మరణించగా, గురువారం జిల్లా ఐ జేయు అధ్యక్షులు చీటి శ్రీనివాసరావు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్న వారు, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐ జేయు జనరల్ సెక్రెటరీ సంపూర్ణ చారి, క్యాషియర్ వేణు గోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుగోపాల చారి, మెట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బూరం సంజీవ్, ఉపాధ్యక్షులు మొహమ్మద్ అఫ్రోజ్, సంయుక్త కార్యదర్శి పింజరి శివ, కార్యవర్గ సభ్యులు మహేందర్, రాజేందర్, సభ్యులు తేలు కంటి గంగాధర్, 20 వ వార్డు కౌన్సిలర్ మసూల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



# దొంగతుర్తి రైతు వేదిక వద్ద గ్రామ సర్పంచ్ కోడారి మంగ అధ్యక్షతన గ్రామసభ


- గ్రామ సభలో పాల్గొన్న వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం శ్రీనాథ్
- కేతి బచావో అభియాన్ కార్యక్రమం



ధర్మారం, జూన్ 04 : ( ప్రజా కలం ప్రతినిధి )

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి రైతు వేదిక వద్ద గ్రామ సర్పంచ్ కోడారి మంగ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలో వ్యవసాయ శాఖ తరపున వ్యవసాయ సహాయ సంచాల కులు ఎం శ్రీనాథ్ మాట్లాడుతూ కేతి బచావో అభియాన్ కార్యక్రమం లో భాగంగా రైతులకు భూసార పరీక్షల ప్రాధాన్యత పై అవగాహన కల్పించారు. రైతులు అందరూ తప్పకుండా మట్టి నమూనాలు పరీక్ష చేసుకొని దానికి అనుగుణంగా ఎరువులను వాడుకోవాలని తెలియజేశారు. వరి కొయ్య కాలను కాల్చే వారిపై చట్టపరమైన చర్యలు తీసు కుంటామని చెప్పారు. వరి కోయ్య కాలను భూమిలో కలియుదున్ని సూపర్ ఫాస్ఫేట్ ఎరువుని చల్లు కోవడం ద్వారా భూమి యొక్క సారం పెరిగి మొక్క కావలసిన పోషకాలు అందుతాయాని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కె. ప్రకాష్ మాట్లాడుతూ రైతులందరూ కూడా ఎల్ నినో మెట్ట వాతావరణ పరిస్థితులు ప్రభావం నుండి బయటపడేందు కు స్వల్పకాలిక వరి రకాలు కే ఎన్ ఎం 1638, జేజిఎల్ 1798, కె ఎన్ ఎం 12368, ఆర్ ఎన్ ఆర్ 15048 వంటి రకాలను సాగు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్, మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులకి వివిధ రూపాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని ఆయిల్ ఫామ్ సాగు చేయడం ద్వారా రైతుకి అధిక ఆదాయాలు వస్తా యని తెలియజేశారు. ఈ కార్య క్రమం లో మండల తహసీల్దార్, మెడికల్ ఆఫీసర్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఏఈఈ, హార్టికల్చర్ ఆఫీసర్, ఏఈఓ, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్, ప్రజాప్రతినిధులు రైతు సోదరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఏసీబీ వలకు చిక్కిన ఎఫ్ఆర్ఓ




జగిత్యాల ప్రతినిధి జూన్ 4 (ప్రజా కలం)

రూ.80 వేల లంచం తీసుకుంటూ ఎఫ్ఆర్ఓ మొయినొద్దీన్ ఏసీబీకి చిక్కాడు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని ఫారెస్ట్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.80 వేల లంచం తీసుకుంటుండగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మొయినొద్దీన్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సమాచారం. ఫిర్యాదు మేరకు పక్కా ప్రణాళికతో వల ఏసీబీ అధికారులు, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే అధికారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు ఏసీబీ అధికారులు వెల్లడించాల్సి ఉంది.

# సంకెనపల్లి గ్రామంలో ప్రత్యేక గ్రామసభ

- గ్రామ సభలో పాల్గొన్న అధికారులు తాహసిల్దార్ శేఖర్, ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్
- గ్రామ సర్పంచ్ కొదురుపాక పూజ-సతీష్ గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో



వెల్గటూర్, జూన్ 04 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలం సంకెనపల్లి గ్రామం లో గురువారం రోజున ప్రత్యేక గ్రామ సభను గ్రామ సర్పంచ్ కొదురుపాక పూజ-సతీష్ ఆధ్వర్యం లో ప్రత్యేక గ్రామసభ కార్యచరణ సమాచార వ్యాప్తి ప్రణాళిక లో భాగంగా వర్షాకాలపు సన్నద్ధత, ఆరోగ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, త్రాగునీరు, జల సంరక్షణ, వన మహోత్సవం, ఓటర్ల జాబితా సవరణ అంశాల పై గ్రామసభ నిర్వహించడం జరిగింది. అదే విధంగా గ్రామం లో విద్యుత్ సమస్యలు, ఇతర సమస్యలు మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ మాట్లాడుతూ పొలాల్లో ఉన్న వరి కొయ్యలను కాల్చవద్దని ఒకవేళ కాల్చినట్ల యితే భూమి యొక్క భూసారం తగ్గిపోతుందని ఎవరైనా కాల్చిన చో వారి పై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు. తహసిల్దార్ మాట్లాడుతూ అన్ని సంక్షేమ పథకాలు నిరుపేద లకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎస్ డబ్ల్యూ ఎం 2026 ప్రకారం చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి తరలించాల ని, వ్యవసాయ వ్యర్థలను కాల్చకూడదు అని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమం లో తహసీల్దార్ శేఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, హెల్త్ డిపార్ట్మెంట్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నట్లు గ్రామ సర్పంచ్ కొదురుపాక పూజ-సతీష్ తెలిపారు.

# దొంగల అరెస్టు..సొత్తు స్వాధీనం..

- కేసును ఛేదించిన జగిత్యాల రూరల్ పోలీసులు
- రూ.4.52 లక్షల 39 బ్యాటరీలు, 4 యూపీఎస్‌లు స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్



జగిత్యాల్ ప్రతినిధి జూన్ 4 (ప్రజా కలం)

గత కొంతకాలంగా గ్రామపంచాయతీ భవనాల్లో ఏర్పాటు చేసిన టి-ఫైబర్ పరికరాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వరుస దొంగతనాల కేసులను జగిత్యాల రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కి తరలించి, వారి వద్ద నుంచి సుమారు రూ.4.52 లక్షల విలువైన దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు గురువారం జగిత్యాల రూరల్ సి.ఐ సుధాకర్ వెల్లడించారు. జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా గురువారం ఉదయం ధరూర్ గ్రామ శివారులోని జగిత్యాల బైపాస్ రోడ్డుపై అంబేద్కర్ విగ్రహం సమీపంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న టిజి 21టి.1774 నంబరు గల ఆటో రిక్షాను తనిఖీ చేయగా, అందులో భారీ సంఖ్యలో బ్యాటరీలు, యూపీఎస్ పరికరాలు లభ్యమయ్యాయి. వెంటనే ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, టి-ఫైబర్ పరికరాల దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు.పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు బండ అంజయ్య గతంలో టి-ఫైబర్‌కు అనుబంధ సంస్థ అయిన స్టెర్‌లైట్ టెక్నాలజీస్ లిమిటెడ్‌లో డ్రైవర్‌గా, అనంతరం టెక్నీషియన్‌గా పనిచేసినట్లు వెల్లడైంది. ఉద్యోగం మానేసిన అనంతరం గ్రామపంచాయతీ భవనాల్లోని టి-ఫైబర్ బ్యాటరీలు, యూపీఎస్‌లను దొంగిలించాలనే పథకాన్ని రూపొందించి, తన సహచరులు మండలి రవి, చెమేల్ల నరేష్‌లకు తెలిపాడు.ముగ్గురు కలిసి గత నెల రోజులుగా ధర్మారం, లక్ష్మీపూర్, తిమ్మాపూర్, కల్లెడ, సంగంపల్లి, హన్మాజీపేట, అనంతారం, గుట్రాజ్‌పల్లి, అంతర్గాం, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన టి-ఫైబర్ పరికరాలను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడినట్లు ,దొంగిలించిన బ్యాటరీలు, యూపీఎస్‌లను ఆటోలో తరలించి ఒకచోట నిల్వ చేసి, విక్రయించేందుకు తీసుకెళ్తున్న సమయంలో పట్టుకున్నట్లు జగిత్యాల రూరల్ సిఐ సుధాకర్ తెలిపారు. లక్ష్మీపూర్ కు చెందిన బండ అంజయ్య, మండలి రవి, చెమేల్ల నరేశ్ ల నుండి సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

# పడుకొని ఉన్న వ్యక్తిని ఇనుప పైపుతో తలపై కొట్టడం వల్ల తలకు తీవ్ర గాయాలు

- నేరస్తుడు కత్తి తీసుకుని తన పీక కోసుకోవడం తో తీవ్ర రక్తస్రావం ఇద్దరినీ హసుపత్రికి తరలింపు
- కరీంనగర్ సన్ రైస్ హస్పత్రిలో చికిత్స పొందుతూ నేరస్తుడు మృతి, మరొకరు సీరియస్

ధర్మారం, జూన్ 04 : ( ప్రజా కలం ప్రతినిధి )

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం పంపు హౌస్ లో లేబర్ గా పనిచేస్తున్నటువంటి రాందేవ్ సింగ్ వయస్సు 50 సంవత్సరాలు గ్రామం మాలం కటారి కోన మండలం, గుమ్లా జిల్లా, జార్ఖండ్ రాష్ట్ర నివాసుడు, నేరస్తుడు అయినటువంటి కైలాష్ గోప్, వయస్సు 30 సంవత్సరాలు గ్రామం కోర్కోటోలి, గుమ్లా జిల్లా, జార్ఖండ్ రాష్ట్రం అను ఇద్దరూ తేదీ 03.06.2026 బుధవారం రోజున బయటకు వెళ్లి మద్యం సేవించినారు. అక్కడ వారి మధ్య లో ఏదో గొడవ జరిగినది. అదే రోజు రాత్రి అందాద 08:45 గంటల ప్రాంతం లో రాందేవ్ సింగ్ తన గదిలో బల్ల పై పడుకుని ఉండగా మద్యం సేవించిన సమయం లో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని నేరస్తుడు అయిన కైలాష్ గోప్ అను వ్యక్తి ఒక ఇనుప పైపు తో రాందేవ్ సింగ్ తలపై చంపాలనే ఉద్దేశం తో బలంగా కొట్టగా అతడి తలకి తీవ్రమైన రక్త గాయం అయినది తర్వాత నేరస్థుడు ఇది చూసి భయపడి అక్కడే ఉన్న ఒక కత్తి తీసుకొని బయట చెట్ల లోకి పారిపోయి, అతడిని చంపేసినా ననే ఉద్దేశం తో తన చేతిలోని కత్తితో తన పీక కోసుకున్నాడు. అది చూసినటు వంటి వారి తోటి పనివారు తీవ్ర రక్త గాయాల తో ఉన్న ఇద్దరిని హసుపత్రికి తరలించినారు. కరీంనగర్ లోని సన్ రైస్ హసుపత్రిలో చికిత్స పొందుతూ నేరస్తుడు అయిన కైలాష్ గోపు అను వ్యక్తి మర ణించినాడు. తీవ్రంగా గాయ పడిన రాందేవ్ సింగ్ హసుపత్రి లో విషమ పరిస్థితులో చికిత్స పొందుతున్నట్లు ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# అడవుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యత

- అటవీ రేంజ్ అధికారి టి.సతీష్ కుమార్



మంథని,జూన్04:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇంచార్జ్ జిల్లా అటవీ అధికారి ఎం.నవీన్ రెడ్డి ఆదేశాల మేరకు మంథని రేంజ్ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం,వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు పెద్దపల్లి అటవీ రేంజ్ అధికారి టి.సతీష్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అడవులు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని,జీవవైవిధ్య పరిరక్షణకు అటవీ సంపద ఎంతో అవసరమని అన్నారు.వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో,భూగర్భ జలాల సంరక్షణలో,స్వచ్ఛమైన గాలి అందించడంలో అడవుల ప్రాధాన్యతను వివరించారు.పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రకృతి పరిరక్షణ పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందించుకోవాలని,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి జి.కొమురయ్య,స్ట్రైక్ ఫోర్స్ ఎఫ్ఎన్ఓ ఎన్.డి.రహీమతుల్లా,ఫారెస్ట్ బీట్ అధికారులు డి.శ్రావంతి,ప్రదీప్,సహాయ శాస్త్రవేత్త పి.కనకజ్యోతి,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డి.కల్పన,ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రమేష్,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.శంకర్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,అటవీ శాఖ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటి నుండి వెళ్లి తిరిగి రాని వులిసె నరేష్

- తల్లి ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదు చేసిన ఎస్ఐ



ధర్మపురి, జూన్ 04 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధి లో నేరెళ్ల గ్రామానికి చెందిన వులిసె నరేష్ వయస్సు (32) సంవత్సరాలు తండ్రి స్వర్గీయ గంగారం తేదీ 03.06.2026 ఉదయం సుమారు 05:30 గంటల సమయం లో ఇంటి నుండి వెళ్లి తిరిగి రాక పోవడంతో ఆయన తల్లి వులిసె విమల ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. తప్పిపోయిన వ్యక్తి వివరాలు వులిసె నరేష్ తండ్రి స్వర్గీయ గంగారం వయస్సు 32 సంవత్సరాలు కులం మున్నూరు కాపు నివాసం నేరెళ్ల గ్రామం ఎత్తు 5 అడుగుల 7 అంగుళాలు చర్మం రంగు చామనచాయ దుస్తులు డబ్బాల టీ-షర్ట్, నీలం రంగు ప్యాంటు వులిసె నరేష్ ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా కనిపించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగలరు లేదా క్రింది సెల్ ఫోన్ నంబర్ ను సంప్రదించ గలరు సంప్రదించవలసిన వారు ధర్మపురి ఎస్సై జి మహేష్ ధర్మ పురి పోలీస్ స్టేషన్ మొబైల్ నెం 8712656824 ధర్మపురి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది ఏమనగా, తప్పి పోయిన వ్యక్తి గురించి ఏదైనా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించగలరు. ధర్మపురి ఎస్సై జి మహేష్ తెలిపారు.

# చర్లపల్లి గ్రామం లో ప్రత్యేక గ్రామసభ

- గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య-మొగిలి, అధికారుల ఆధ్వర్యంలో




ఎండపల్లి, జూన్ 04 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామం లో గురువారం రోజున గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య-మొగిలి ఆధ్వర్యం లో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు ఈ కార్యచరణ సమాచార వ్యాప్తి ప్రణాళిక లో భాగంగా వర్షాకాల సన్నద్ధత, ఆరోగ్యం, ఘన వ్యర్థాల నిర్వ హణ, త్రాగునీరు, జల సంరక్షణ, వన మహోత్సవం, ఓటర్ల జాబితా సవరణ అంశాల పై గ్రామసభ నిర్వహించడం జరిగింది. అదే విధంగా గ్రామం లో విద్యుత్ సమస్యలు, ఇతర సమస్యలు మండల అధికారుల దృష్టికి తీసు కెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఎండపల్లి ఎంపీడీఓ దొండ కృపాకర్ మాట్లాడుతూ అన్ని సంక్షేమ పథకాలు నిరుపేద లకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎస్ డబ్ల్యూ ఎం 2026 ప్రకారం చెత్తను 4 రకాలు గా వేరు చేసి తరలించాలని వ్యవసాయ వ్యర్థలను కాల్చ కూడదని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమం లో తహసీల్దార్, ఎడ్ల అనిల్ కుమార్, ఎండపల్లి మండల విద్య అధికారి సము ద్రాల హరికృష్ణ, వ్యవసాయ అధికారి కమల్ల మహేష్, విద్యుత్ ఏఈ బండి సమ్మయ్య, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ, హెల్త్ డిపార్ట్మెంట్, ఉపసర్పంచ్ తిరుపతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ, నాయకులు, ప్రజలు పాల్గొన్నట్లు గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య-మొగిలి తెలిపారు.

# దొంగతనానికి పాల్పడుతున్న భార్యాభర్తల అరెస్ట్ - రిమాండ్






మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 4 (ప్రజా కలం) మెట్ పల్లి సర్కిల్ పరిధిలోనీ మెట్ పల్లి ఇబ్రహీంపట్నం మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లోనీ టెంపుల్ లలో వరుస దొంగతనాలు జరుగుతుండగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్ పల్లి డిఎస్పి రాములు ఆధ్వర్యంలో మెట్ పల్లి సిఐ బి సురేష్ బాబు నేతృత్వంలో మెట్ పల్లి ఎస్సై కిరణ్ కుమార్,మల్లాపూర్ ఎస్సై అనిల్,ఇబ్రహీంపట్నం ఎస్సై జి నవీన్ కుమార్, ఐడి పార్టీ కానిస్టేబుల్ విశాల్,కిరణ్, ప్రణయ్ లతో కలిసి గాలిస్తుండగా సిసి ఫుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తించి వారి కోసం గాలిస్తుండగా దొంగలు వెల్లుల్ల గ్రామానికి చెందిన ఆరే శంకర్, అతని భార్య ఆరే అనూష మరి కొందరు కలిసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని బండలింగాపూర్, వర్షకొండ తిమ్మాపూర్ వేముల కుర్తి గ్రామాల్లోని పలు ఆలయాలల్లో, మెట్ పల్లి మండలం ఆత్మకూరులో వేంపేట్, మల్లాపూర్ మండలంలోని సిర్పూర్ రాఘవపేట్ లోని పలు ఆలయాలలో కథలాపూర్ మండలంలోని ఊట్పల్లి గ్రామంలో మొత్తంగా 8 కేసులలో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. గురువారం విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులను పట్టుకొని విచారించగా ఎనిమిది కేసులలో దొంగతనం చేసినట్లుగా ఒప్పుకున్నట్లు తెలిపారు.వారి వద్ద నుండి వారి దొంగతనం చేసిన దొంగ సొత్తు 20 గ్రాముల బంగారం,1.250 కేజీల వెండిని స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు వెల్లడించారు.

ప్రజా కలం
శుక్రవారం, జూన్ 5, 2026

## విద్యార్థుల జీవితాలతో ఆటలా...

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 12వ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అనేక లోపాలు, తేడాలు బయటపడడం దేశవ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. నీట్ ప్రశ్నపత్రాల లీక్ సంఘటన మరువక ముందే సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలు వివాదాస్పద చర్చకు దారితీస్తున్నాయి. సిబిఎస్ఇ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వల్లనే ఈ గందరగోళం ఏర్పడింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విద్యార్థుల పునఃమూల్యాంకన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో తమ పోర్టల్‌పై భారీ సైబర్ దాడికి ప్రయత్నాలు జరిగాయని సీబీఎస్ఈ ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో 16 వేల మంది రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొంది. ఈ సమయంలోనే కొందరు డినయల్-ఆఫ్-సర్వీస్ అనే విధానంతో పోర్టల్‌పై దాడికి ప్రయత్నించారని, దీని వల్ల 2 నిమిషాల్లోనే దాదాపు 15 లక్షల మంది లాగిన్ అవ్వడానికి ప్రయత్నించారని తెలిపింది. అనధికారికంగా పోర్టల్‌లోకి చొరబడేందుకు లక్షకుపైగా సైబర్‌దాడుల ప్రయత్నాలు జరిగినట్లు తమ భద్రత వ్యవస్థ గుర్తించిందని వివరించింది. అయితే, ఈ సైబర్ దాడులను సమర్థంగా అడ్డుకున్నామని, ప్రస్తుతం పోర్టల్ పనిచేస్తూనే ఉందని చెప్పింది. విద్యార్థుల రీవేల్యూషన్ దరఖాస్తులను ప్రాసెస్ జరుగుతోందని తెలిపింది. ఒకేసారి 8,000 మందికిపైగా స్టూడెంట్లు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చిన వెల్లడించింది. టెక్నికల్ టీమ్‌లు ఈ ప్లాట్‌ఫామ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని.. ఏదైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే స్పందిస్తున్నాయని పేర్కొంది. విద్యార్థులకు ఎటువంటి అంతరాయం లేకుండా సేవలను అందించేందుకు తమ బృందాలు కృషి చేస్తున్నాయని సీబీఎస్ఈ పేర్కొంది. ప్లస్‌టూ లో సీబీఎస్ఈ కొత్తగా తీసుకొచ్చిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం కారణంగా తమ జవాబు పత్రాలు తారుమారయ్యాయంటూ కొందరు విద్యార్థులు ఆందోళనలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర దుమారం రేగడంతో సీబీఎస్ఈ స్పందించింది. సమాధాన పత్రాల స్కానింగ్ కాపీలను విద్యార్థులకు అందిస్తామని, వాటిని పరిశీలించిన తర్వాత రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పునఃమూల్యాంకనం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకునే పోర్టల్‌పైనే తాజాగా సైబర్ దాడి జరిగినట్లు వెల్లడించింది. జాతీయ స్థాయి పరీక్షలైన క్యూట్‌యుజి వల్ల విద్యార్థులు వేర్వేరు విశ్వవిద్యాలయాలకు ప్రత్యేకంగా ఎంట్రన్స్ పరీక్షలు రాయవలసిన అవసరం లేకుండా ఒకే పరీక్ష ద్వారా దేశంలోని అత్యుత్తమ యూనివర్శిటీల్లో సీట్లు పొందగలుగుతారు. అయితే క్యూట్‌లో ఎదురవుతున్న సాంకేతిక లోపాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, సిబిఎస్ఇల్లో పదేపదే జరుగుతూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే ఉత్తీర్ణత శాతం గత ఏడాది 88.39 శాతం ఉండగా, ఈ ఏడాది 85.29 శాతానికి దిగజారింది. 90 శాతం కన్నా స్కోరు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా బాగా తగ్గింది. దీంతో చాలా మంది విద్యార్థులు తాము ఆశించిన విధంగా ఫలితాలు రాకపోవడంతో మూల్యాంకనం కోసం ఆశ్రయించారు. 4 లక్షలకు మించి విద్యార్థులు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలు కావాలని అభ్యర్థించారంటే ఎంత మంది ఈ ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారో తెలుస్తోంది. ఫిబ్రవరి 17న ఈ 12వ తరగతి పరీక్షలు జరగ్గా, ఈ పరీక్షలకు కేవలం పదిరోజులకు ముందుగా ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ అమలు గురించి ఉపాధ్యాయులకు తెలియజేయడం విడ్డూరం. ఈ కొత్త పద్ధతిపై ఉపాధ్యాయులకు ఎంతవరకు అవగాహన ఉంది? వారు స్కానింగ్ చేసిన జవాబు పత్రాలను డిజిటల్ ప్రక్రియలో దిద్దగలరా? స్కానింగ్ కాపీలు స్పష్టంగా ఉంటున్నాయా? ఇవేవీ పరిశీలించకుండానే హడావిడిగా అమలు చేయడం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కూడా ఇదో అగ్నిపరీక్షగా తయారై అనేక లోపాలు పుట్టుకొచ్చాయి. ఫిబ్రవరి 9న సిబిఎస్ఇ జారీ చేసిన సర్కులర్‌లో ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించింది. విద్యా సంస్కరణల్లో నూతన అధ్యాయం తప్పులు పూర్తిగా తొలగించవచ్చని, మానవ సహాయం చాలావరకు తగ్గుతుందని, మూల్యాంకనం అంటే పేపర్లు దిద్దడం చాలా వేగంగా జరుగుతుందని, ఫలితాలు వెలువడిన తరువాత తిరిగి పరిశీలించవలసిన అవసరం రాదని ఇలా ఎన్నెన్నో పేర్కొంది. కానీ ఆచరణాత్మకం వాటికి భిన్నంగా ఫలితాలు కనిపించాయి. 17 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. అంటే వీరికి 98 లక్షల జవాబు పత్రాల పుస్తకాలు అందించారు. అంటే 40 కోట్ల పేజీలు ఇచ్చినట్టు. ఇవన్నీ మాన్యువల్‌గా రికార్డు సమయానికి స్కానింగ్ చేయవలసి ఉంటుంది. మూల్యాంకనం కోరిన వారికి ఇవన్నీ పరిశీలించవలసి ఉంటుంది. దీనికి తగిన కనీస మౌలిక అవసరాలు, కంప్యూటర్లు, లాకింగ్ సిస్టమ్ తదితర సాంకేతికత సరిగ్గా లేక గందరగోళం ఏర్పడి తప్పుల కుప్పలు కనిపిస్తున్నాయి. అంటే సిబిఎస్ఇ పరీక్షల నిర్వహణ ఎంత లోపభూయిష్టంగా ఉందో స్పష్టమవుతోంది. స్కానింగ్ వ్యవస్థ పూర్తిగా అందుబాటులోకి రాకుండా ఆన్‌స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియను ఎందుకు సిబిఎస్ఇ ప్రవేశపెట్టిందో అర్థంకావడం లేదు. ఇది క్షమించరానిది. ఇది తాత్కాలిక సర్దుబాటుగా సిబిఎస్ఇ చెబుతున్నా సక్రమంగా అంతవరకు ఉన్న వ్యవస్థను నాశనం చేసినట్టే. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ లోపాలపై ఎవరు దర్యాప్తు చేస్తారు? లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థ వల్ల మూల్యాంకనం తప్పులు, అక్రమాల పుట్టగా తయారైందని ధ్వజమెత్తారు. సిబిఎస్ఇ పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే, దానికి మీకు బిల్లుపడుతుందన్నారు. డిజిటల్ స్కాన్ కాపీ తీసుకోవాలంటే ఒక సబ్జెక్టుకు రూ. 100, ఒక పేపర్ రీటోటలింగ్‌కు రూ. 100, రీ ఎవాల్యుయేషన్ చేయించుకోవాలంటే ఒక ప్రశ్నకు రూ. 25, మొత్తంగా ఒక విద్యార్థి తన జవాబు పత్రాన్ని సరిగ్గా దిద్దించుకోవడానికి దాదాపు రూ. 2000 చెల్లించవలసి రావచ్చన్నారు. మొత్తం 4 లక్షల మంది విద్యార్థులు మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు సిబిఎస్ఇ ఎంత సొమ్ము ఆర్జిస్తోందో గమనించాలని విద్యార్థులకు సూచించారు. ఇదంతా శిక్ష పడుతున్నది విద్యార్థులకు, ఆదాయం ప్రభుత్వానికి అని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా ఈ పరీక్షల నిర్వహణకు ఎడ్యుటెక్ అనే సంస్థను సిబిఎస్ఇ ఎంపిక చేయడాన్ని ఆక్షేపించారు. తెలంగాణలో గ్లోబరేనా అనే పేరుతో ఈ సంస్థ 2019, 2023లో స్కామ్‌కు పాల్పడిందని, అలాంటి రికార్డు ఉన్న సంగతి సిబిఎస్ఇకి తెలియదా? అని ప్రశ్నించారు. ఈ కంపెనీ రికార్డు తెలిసినా దీన్ని ఎంచుకోవడంలో ఏదో నిగూఢమైన కారణం ఉందని ఆరోపించారు. అయితే ప్రభుత్వ ప్రొక్యూర్‌మెట్ పాలసీ ప్రకారమే ఈ కంపెనీని ఎంపిక చేసినట్టు సిబిఎస్ఇ వెల్లడించింది. అయితే జవాబు పత్రాల మూల్యాంకన పోర్టల్‌లోని లోపాలను వినియోగదారులు బయటపెట్టడంతో సిబిఎస్ఇ వాటిని అంగీకరించడమే కాక, ఈ కంపెనీపై జరిమానా విధించడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. విద్యార్థులు తమ బాల్యం లోని మంచి దశను, వారి ఆత్మస్థైర్యాన్ని నాశనం చేసే బోర్డు, ప్రవేశ పరీక్షల కోసం త్యాగం చేయవలసి వస్తోందని పరీక్షల నిర్వాహకులు తెలుసుకోవాలి. యువత తమ కెరీర్, ఉన్నత చదువుల కోసం రాసే ఈ ప్రవేశ పరీక్షల ఒత్తిడి, పోటీ కారణంగా వారు స్వేచ్ఛను కోల్పోయి, పరీక్షలకే పరిమితమవుతున్నారు. ఇది విద్యార్థి తరానికి జరిగిన ఒక బాధాకరమైన, నిరాశపరిచే నమ్మకద్రోహం.

## ఇసుక రీచ్‌ల గుర్తింపు, తవ్వకాలపై క్షేత్రస్థాయి అధ్యయనాలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

**వర్షాకాలం అనంతరం ఇసుక నిల్వ ప్రాంతాలపై భూగర్భ జల శాఖ ద్వారా సమగ్ర అధ్యయనం నిర్వహించాలి**

**ధర్మపురి గోదావరి పరిధిలో ప్రస్తుతం ఎటువంటి అధికారిక ఇసుక తవ్వకాల అనుమతులు లేవు**




జగిత్యాల్ ప్రతినిధి జూన్ 4 ( ప్రజా కలం)

ఇసుక రీచ్‌ల గుర్తింపు, తవ్వకాలపై క్షేత్రస్థాయి అధ్యయనాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అన్నారు. జిల్లాలో ఇసుక నిల్వ ప్రాంతాల గుర్తింపు, భూగర్భ జల శాఖ సాధ్యాసాధ్యాల నివేదికలు, స్థానిక అవసరాలు , ప్రభుత్వ పనుల కోసం ఇసుక అందుబాటుపై జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ (డీ.ఎల్.ఎస్.సీ) సమావేశం గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధ్యక్షతన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతు ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేవని, వర్షాకాలం అనంతరం పరిస్థితులను సమీక్షించి ఇసుక లభ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ముగిసిన తర్వాత భూగర్భ జల శాఖ ద్వారా సమగ్ర అధ్యయనాలు నిర్వహించి భవిష్యత్తులో ఇసుక తవ్వకాలకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బలహీన వర్గాల గృహ నిర్మాణాల కోసం మినహా ప్రతి ఇసుక లావాదేవీ ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇసుక తవ్వకం, రవాణా, విక్రయాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధర్మపురి మండల పరిధిలో గోదావరి నదిలో ప్రస్తుతం అధికారికంగా ఎటువంటి ఇసుక తవ్వకాల అనుమతులు లేవని కలెక్టర్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా రెవెన్యూ, పోలీసు, గనుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదే సమయంలో గోదావరి పరివాహక ప్రాంతంలో అనువైన ఇసుక నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇబ్రహీంపట్నం నుంచి గోదావరి నది పరిధిలో అనువైన ఇసుక రీచ్‌లను గుర్తించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ గనుల అభివృద్ధి సంస్థ (టీజీఎంఐడీసీ)కు అప్పగించే ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ సూచించారు.


సమావేశంలో భూగర్భ జల శాఖ సమర్పించిన సాధ్యాసాధ్యాల నివేదికలను కమిటీ పరిశీలించింది. పెద్దవాగు, గోదావరి నదిలో గుర్తించిన ఇసుక నిల్వ ప్రాంతాలపై సంబంధిత శాఖల అధికారులు నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను సమీక్షించింది. భూగర్భ జల శాఖ నివేదికల ప్రకారం కొన్ని ప్రాంతాలు ప్రస్తుతం ఇసుక తవ్వకాలకు అనుకూలంగా లేవని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, రెవెన్యూ డివిజనల్ అధికారులు మధుసూదన్, జి. నర్సింహారావు, దివాకర్ రెడ్డి, జిల్లా భూగర్భ జల అధికారి శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఈ. మురళి, గనులు మరియు భూగర్భశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్కారు దవాఖానాలో కార్పొరేట్ వైద్యం

**- ఒకే రోజు రెండు విభిన్న యూరాలజీ శస్త్రచికిత్సలు**

పెద్దపల్లి,జూన్ 04:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిపుణులైన వైద్య బృందం ఒకే రోజు రెండు విభిన్నమైన యూరాలజీ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. కల్వచర్ల గ్రామానికి చెందిన 21 సంవత్సరాల యువకుడు తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రికి రాగా,వైద్యులు పరీక్షలు నిర్వహించి మూత్రనాళంలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం వైద్యుల బృందం అతనికి అత్యంత నైపుణ్యంతో డీజే స్టెంట్ అమర్చి ఉపశమనం కలిగించారు. కొలనూరు గ్రామానికి చెందిన 28 సంవత్సరాల మహిళకు రెండు నెలల క్రితం మూత్రనాళ సమస్య కారణంగా ఆసుపత్రిలో డీజే స్టెంట్ అమర్చగా,గురువారం ఆమెకు ఆ స్టెంట్‌ను విజయవంతంగా తొలగించారు. ఈ రెండు క్లిష్టమైన శస్త్రచికిత్సలలో యూరాలజిస్ట్ డాక్టర్ సంతోష్ రెడ్డి,జనరల్ సర్జన్ డాక్టర్ రాము,అనెస్తేషియా నిపుణులు డాక్టర్ కృష్ణవేణి,ఓటీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలు నిర్వహించిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.శ్రీధర్ ఒక ప్రకటన విడుదల చేస్తూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం



సేవలు, 2డీ ఎకో సేవలు,ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ సేవలు మరియు రూట్ కెనాల్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సేవలను పొందడంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను కలవవచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకముల వైద్య సేవలు, మందులు పూర్తిగా ఉచితమని,ఎవ్వరికీ ఎలాంటి లంచాలు ఇవ్వరాదని ఆయన స్పష్టం చేశారు. పేషెంట్లు ఆసుపత్రిలో ఉన్న సమయంలో సానిటేషన్ గురించి గానీ,వాష్ రూమ్ శుభ్రత గురించి గానీ ఎవరైనా డబ్బులు అడిగితే నర్సింగ్ సూపరింటెండెంట్‌ను, ఆర్ఎంఓను లేదా నేరుగా సూపరింటెండెంట్‌ను సంప్రదించవచ్చని, లేనియెడల ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్‌లో వేయవచ్చని తెలిపారు. బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి కట్టుబడి ఉన్నామని సూపరింటెండెంట్ స్పష్టం చేశారు.

## మెట్పల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రం పరిశీలన

**- కాంగ్రెస్ నేత జువ్వడి కృష్ణారావు**




మెట్ పల్లి రూరల్,జూన్ 4:(ప్రజా కలం):

మెట్పల్లి మండలం మెట్ల చిట్టాపూర్ జగ్గాసాగర్ ఆత్మకూర్ గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వడి కృష్ణారావు ఆదివారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్శనలో కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సందర్శన అనంతరం జరిగిన పత్రికా సమావేశంలో జువ్వడి కృష్ణారావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నుండి వడ్ల కొనుగోలు కార్యక్రమం విజయవంతంగా జరుగుతూ ఉందని తెలిపారు. లి"ఇంతవరకు 90 శాతం కొనుగోలు పూర్తయ్యింది. మిగిలిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది"లి అని స్పష్టం చేశారు. రైతులు ఎటువంటి నిరాశకు గురికావద్దని, ప్రభుత్వం యాదృచితంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగిస్తుందని అన్నారు."రైతు ప్రభుత్వమే, కాంగ్రెస్ ప్రభుత్వం "లి అని గట్టిగా ప్రకటించారు. రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వం ధ్యేయం అని, వారి సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.

## రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

**- మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 4 (ప్రజాకలం) షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ ద్వారా 2025-26 ఆర్థిక ఏడాదికి ఆర్థిక సహాయం పొందుటకు దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులకు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా సమావేశ మందిరములో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఇదే రోజు 6 న మద్యాహ్నం 3.00 గంటలకు మైనారిటీ సంక్షేమ శాఖ ఆర్థిక సహాయము మంజూరికై ధరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు కూడా ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ, మైనారిటీ సంక్షేమ శాఖ వారి ఆర్థిక సహాయం ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 6 న నిర్వహించు ఇంటర్వ్యూలకు నిర్దేశించిన సమయానికి మెప్మా కార్యాలయములో హాజరు కావాలని కమీషనర్ శ్రీనివాస్ గౌడ్ సూచించారు.



## భవ్యశ్రీ ను అభినందించిన రమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి

గద్వాల ప్రతినిధి జూన్ 4 (ప్రజా కలం న్యూస్)జోగులాంబ గద్వాల జిల్లామల్దకల్ మండలంలోని నీలిపల్లి గ్రామానికి చెందిన శివ కేశవరెడ్డి కుమార్తె భవ్యశ్రీ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగానికి ఎంపికైన సందర్భంలో బండ్ల రాజశేఖర్ రెడ్డి నివాసంలో భవ్యశ్రీ కి స్వీట్ తినిపించి అభినందించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రమ్య ఇండస్ట్రీస్ అధినేత శ్రీ బండ్ల రాజశేఖర్ రెడ్డి దంపతులు. ఈ సందర్భంగా బండ్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో ఉద్యోగం సాధించడం గర్వించదగ్గ విషయమని, రానున్న రోజుల్లో మంచి స్థానంలో ఉండాలని గ్రామానికి జిల్లాకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఈ సందర్భంగా శ్రీ బండ్ల రాజశేఖర్ రెడ్డి కొనియాడారు.



# మట్టి మాఫియా ఆరోపణల్లో నిజం లేదు

**నిబంధనల ప్రకారమే మట్టి తరలింపు - అక్రమాల్ని నిరూపిస్తే ఏ చర్యలకైనా సిద్ధం - పెద్దపల్లి ఇటుక బట్టీ యజమానులు**



పెద్దపల్లి,జూన్ 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

నిబంధనలకు లోబడే తాము చెరువు మట్టిని తరలిస్తున్నామని,తమపై మట్టి మాఫియా అంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని పెద్దపల్లి ఇటుక బట్టీ యజమానులు స్పష్టం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్కే గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు రాజకీయ నాయకుల విమర్శలను తీవ్రంగా ఖండించారు. తాము ప్రభుత్వానికి చెల్లించాల్సిన మైనింగ్ రాయల్టీని సక్రమంగా చెల్లిస్తూ,అధికారిక వే-బిల్లుల ద్వారానే మట్టిని రవాణా చేస్తున్నామని, ఈ ప్రక్రియ అంతా రెవెన్యూ, ఇరిగేషన్,గ్రామ పంచాయతీ మరియు పోలీస్ శాఖల సంపూర్ణ పర్యవేక్షణలోనే జరుగుతోందని వివరించారు. జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం తాము కేవలం 12 టైర్ల వాహనాలను మాత్రమే వాడుతున్నామని,నిర్ణీత పరిమితి మేరకే 20 నుండి 25 టన్నులు మట్టిని లోడ్ చేస్తున్నామని యజమానులు పేర్కొన్నారు. పెద్దపల్లి,సుల్తానాబాద్ పట్టణాల్లోని ప్రధాన రహదారుల వెంబడి సీసీ కెమెరాల నిఘా ఉందని,తాము ఎక్కడైనా 14 లేదా 16 టైర్ల భారీ వాహనాలతో అక్రమంగా ఓవర్ లోడ్ తరలించినట్లు ఒక్క ఆధారం చూపించినా ప్రభుత్వం తీసుకునే ఎలాంటి చట్టపరమైన చర్యలకైనా కట్టుబడి ఉంటామని సవాల్ విసిరారు. ఇటుకల తయారీ అనేది ఏటా సాగే నిరంతర ప్రక్రియ అని,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కాకుండా గతంలో బీఆర్ఎస్,టీడీపీ హయాంలోనూ ఈ వ్యాపారాలు నడిచాయని గుర్తుచేశారు. కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీ అనే తేడా లేకుండా అన్ని ప్రధాన పార్టీల నాయకులకు ఇటుక బట్టీల వ్యాపారాలు ఉన్నాయని, అలాంటప్పుడు తమను మాత్రమే లక్ష్యంగా చేసుకుని బురదజల్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయ కక్షలతో వ్యాపారాలను ఇబ్బంది పెడితే,ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి ఇటుకల ధరలు పెంచాల్సి వస్తుందని,దీనివల్ల అంతిమంగా ఇల్లు కట్టుకునే సామాన్యుడిపైనే భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు విమర్శలు చేసుకోవాలనుకుంటే ప్రజా సమస్యలు,రోడ్ల దుస్థితి,ప్రభుత్వ పథకాల అమలుపై పోరాడాలి తప్ప,ఉపాధి కల్పిస్తున్న వ్యాపారాలను దెబ్బతీయవద్దని హితవు పలికారు. ఈ మీడియా సమావేశంలో ఇటుక బట్టీల యజమానులు ఆనందరావు, లక్ష్మణరావు,ఆడపు వెంకటేశ్వరులు, సిద్దయ్య,జాఫర్,ప్రదీప్,సతీష్ రావు,అవినాష్,సాగర్ రావు,సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల నియోజకవర్గంలో పలువురు కుటుంబాలను పరామర్శించిన డాక్టర్ రఘు






మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 4 (ప్రజా కలం) మెట్ పల్లి మండలం ఆరపేట గ్రామంలో సిరిపూర్ తిరుపతి రెడ్డి పెద్దమ్మ కుమారుడు పుడుకారం వెంకట్ రెడ్డి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను డాక్టర్ రఘు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం గోదూర్ గ్రామానికి చెందిన సోమ శ్రీనివాస్ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను నిత్యసాయి చాటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పరామర్శించారు. సత్తెక్కపల్లి గ్రామానికి చెందిన నల్ల వెంకటేష్ వదిన ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# నల్లబెల్లి గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ

## -డిజిటల్ జనగణనలో ప్రజలు భాగస్వాములు కావాలి : తహసీల్దార్ విజయసాగర్

## -సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సాయిబాబు సూచన



జూన్ 4 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్/ వర్ధన్నపేట) వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం ప్రత్యేక గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండల తహసీల్దార్ విజయసాగర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా డిజిటల్ విధానంలో జనగణన ప్రక్రియ చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. స్వీయ నమోదు ప్రక్రియతో పాటు తొలి దశలో గృహాల వారీగా గృహ గణన చేపడతారని తెలిపారు. అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కొనసాగుతున్నందున ప్రజలు తమ వివరాలను సక్రమంగా అందించాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా సురక్షిత తాగునీటి వినియోగం, పారిశుధ్య చర్యలు, వన మహోత్సవం కింద మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం వర్ధన్నపేట ఎస్సై సాయిబాబా మాట్లాడుతూ గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని అన్నారు. వర్షాకాలంలో వరదలకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ చర్యలు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో అధిక సంఖ్యలో మొక్కలు నాటేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీవో నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ అమరేందర్, పంచాయతీ కార్యదర్శి షేక్ హుస్సేన్, వార్డు సభ్యులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వ్యాసానలకు బానిసలు కావద్దు తాడిచెర్ల ను తీర్చిదిద్దడమే లక్ష్యం

### కాటారం సిఐ నాగార్జున రావు. కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్.. గ్రామసభలో అవగాహన సదస్సు...



మల్హర్ , జూన్ 04 ప్రజాకలం ప్రతినిధి...మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామపంచాయతీలో ప్రజపాలన కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ బండి స్వామి అధ్యక్షతన గురువారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే వర్షాకాల సన్నద్ధత, గ్రామంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ ప్రాధాన్యతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా సమాజంలో పెను సవాలుగా మారిన డ్రగ్స్ నియంత్రణ, రహదారి భద్రతకు సంబంధించిన ట్రాఫిక్ నిబంధనలు, ప్రస్తుత సీజన్‌కు తగ్గట్టు వ్యవసాయ పద్ధతులు మరియు ఇతర ముఖ్యమైన సామాజిక అంశాలపై అధికారులచే విస్తృత అవగాహన సదస్సు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె. రవి కుమార్, ఎంపీడీవో క్రాంతికుమార్, కాటారం సిఐ నాగార్జున రావు, ఎస్ఐ వడ్లకొండ నరేష్, ఎస్ఐ 2 రాజన్ కుమార్, వ్యవసాయ అధికారి శ్రీజ, ఐకేపీ ఏపిఎం, ఇరిగేషన్ డిఈ, ఏఈ, విద్యుత్ శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మా ఎస్సీ కాలనీలో ఇండ్లలోకి మురుగునీరు చేరుతుంది పట్టించుకోండి

### - మోరీలలో నిండిన చెత్త చెదారం...



మల్హర్, జూన్ 04 ప్రజాకలం ప్రతినిధి... మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామ పరిధిలోని పాత ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రరూపం దాల్చింది. కాలనీలోని మురుగు కాల్వలలో వేసిన మోరీల కారణంగా నీరు ముందుకు సాగడం లేదు. దీనికి తోడు కాల్వలలో పెద్ద ఎత్తున చెత్తాచెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు వచ్చి జమ కావడంతో మురుగునీరు పూర్తిగా నిలిచిపోయింది. దీంతో మురుగునీరంతా వెనక్కి తన్ని స్థానికుల ఇండ్లలోకి చేరుతోంది. ఇండ్ల చుట్టూ, లోపలికి వస్తున్న వాసన నీటి వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, ఈగలు పెరిగిపోయి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తాడిచర్ల గ్రామ పంచాయతీ సిబ్బంది, సర్పంచ్ స్పందించి, తక్షణమే ఈ మురుగు కాల్వలను శుభ్రం చేయించి సమస్యను తొందరగా పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

## పంట అవశేషాలను తగులబెడితే రూ.5 వేల జరిమానా - వ్యవసాయ అధికారి శ్రీజ

మల్హర్, జూన్ 4 ప్రజాకలం ప్రతినిధి... వరి కోతల అనంతరం పొలాల్లో కొయ్యకాల్ని తగులబెట్టడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘిస్తే రూ. 5,000 జరిమానా విధిస్తామని మల్హర్ రావు మండల వ్యవసాయ అధికారి బొల్లపెల్లి శ్రీజ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన తాడిచెర్ల లో పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. మంటల వేడికి నేలలోని



నత్రజని, ఫాస్ఫరస్ వంటి ముఖ్య పోషకాలతో పాటు మిత్ర పురుగులు నశిస్తాయని, ఫలితంగా దిగుబడి పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ కాలుష్యంతో పాటు ఒక్కోసారి ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదముందన్నారు. అదే వ్యర్థాలను భూమిలోనే కలియదున్నితే సేంద్రియ కర్బన శాతం పెరిగి, దిగుబడి 5 నుంచి 10 శాతం పెరుగుతుందని తెలిపారు. దున్నే ముందు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్పి) చల్లితే, అవశేషాలు రెండు వారాల్లోనే కుళ్ళిపోయి మేలైన సేంద్రియ ఎరువుగా మారుతాయన్నారు. దీనివల్ల రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుందని, రైతులు ఈ సూచనలు పాటించాలని కోరారు.

# అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ చిటూరి రాజుకి దళిత రత్న అవార్డు ప్రధానం

### - రవీంద్ర భారతిలో పలువురు ప్రముఖుల చేత స్వీకరణ
### - రాజుకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన సన్మానం
### - అనగారిన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో సేవలు
### - దళిత రత్న అవార్డుతో మరింత బాధ్యత పెరిగింది



జూన్ 04ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)

సమాజ సేవకు గుర్తింపుగా లభించిన 'దళిత రత్న' అవార్డుతో వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన సామాజిక కార్యకర్త, అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ చిట్టూరి రాజు మరోసారి వార్తల్లో నిలిచారు. దళితుల హక్కుల సాధన, సామాజిక న్యాయం, విద్యా చైతన్యం, ఉపాధి అవకాశాల కల్పన కోసం ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా అందుకున్న ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా ప్రముఖుల చేతుల మీదుగా 'దళిత రత్న' అవార్డును అందుకున్న చిట్టూరి రాజు, అనంతరం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తులకు ఇలాంటి గౌరవాలు దక్కడం ఆనందదాయకమన్నారు. గ్రామ స్థాయి నుంచి దళితుల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతూ, సామాజిక చైతన్యానికి మార్గదర్శకుడిగా నిలుస్తున్న చిట్టూరి రాజు సేవలు అభినందనీయమని కొనియాడారు. దళిత సంఘాల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించిన చిట్టూరి రాజు, అనేక సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ప్రత్యేక గుర్తింపు పొందారు. విద్య, ఉపాధి, హక్కుల సాధన, సంక్షేమ పథకాల అమలులో అవగాహన కల్పించడం వంటి అంశాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. గ్రామీణ ప్రాంతాల్లోని దళిత యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు నిర్వహించిన కార్యక్రమాలు మంచి స్పందన పొందాయని స్థానికులు పేర్కొన్నారు.

సేవా ప్రస్థానానికి గుర్తింపు

దళిత రత్న అవార్డు తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదని, సమాజ సేవకు లభించిన గుర్తింపని చిట్టూరి రాజు అన్నారు. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, దళితుల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, సామాజిక సమానత్వం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను గ్రామస్థాయిలో ఆచరణలోకి తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు.

శుభాకాంక్షల వెల్లువ

చిట్టూరి రాజుకు దళిత రత్న అవార్డు రావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులు, యువకులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తుళ్ల రవి, అంబేద్కర్ నగర్ ఉపసర్పంచ్ చంద్రయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు సింగపురం ఎల్లయ్య, పారానంది రాజు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరం... సురక్షిత జీవనానికి చేరువ

### -'అరైవ్ అండ్ అలైవ్'పై బురాన్‌పల్లిలో విస్తృత అవగాహన
### -గ్రామసభలో యువతకు సూచనలు
### -సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ప్రాధాన్యంపై ఎస్సై రాజేందర్ వివరణ



జూన్ 4 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

సమాజంలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాయపర్తి మండల ఎస్సై ముత్యం రాజేందర్ పిలుపునిచ్చారు.
వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాన్‌పల్లి గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభలో పాల్గొన్న ఎస్సై రాజేందర్, గ్రామ ప్రజలు, యువతను ఉద్దేశించి మాట్లాడారు. మత్తు పదార్థాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని, అలాంటి అలవాట్లు వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలను కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయని హెచ్చరించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత అవసరమని, వాటి ద్వారా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. అలాగే రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రమాదాలను నివారించడం అని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. యువత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ప్రమాద రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా భద్రతలో గ్రామస్థుల భాగస్వామ్యం కీలకమని పేర్కొంటూ, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు తుళ్ల సంపత్, బండి సుధాకర్, బానోత్ సుమన్, రెవెన్యూ శాఖ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, యువత, మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామసభలో పోలీసు శాఖ అందించిన అవగాహన కార్యక్రమానికి గ్రామస్థులు సానుకూలంగా స్పందించారు.

# గురుకుల విద్యాసంస్థల అవసరాల కొనుగోలుకు సీల్డ్ టెండర్ల ఆహ్వానం

### - టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ జిల్లా సమన్వయ అధికారి సునీత
### - జూన్ 17 వరకు టెండర్ల స్వీకరణ, జూన్ 18న జిల్లా కొనుగోలు కమిటీ సమక్షంలో టెండర్ల ఓపెన్

ఖమ్మం, జూన్ 04(ప్రజా కలం న్యూస్ )

2026-27 విద్యా సంవత్సరానికి గాను ఖమ్మం జిల్లా పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సమాఖ్య (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ) ఆధ్వర్యంలోని 13 గురుకుల పాఠశాలలు, ఒక మహిళా డిగ్రీ కళాశాలలో అవసరమయ్యే కూరగాయలు, పండ్లు, స్కిన్‌లెస్ చికెన్, మటన్, కేటరింగ్ సేవలు, స్టేషనరీ సామగ్రి, ల్యాబ్ మెటీరియల్ కొనుగోలు నిమిత్తం అధీకృత డీలర్లు, సరఫరాదారులు, ఆసక్తి గల వ్యక్తుల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ జిల్లా సమన్వయ అధికారి ఎం. సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సత్తుపల్లి, తిరుమలాయపాలెం, ముదిగొండ బాలుర గురుకుల పాఠశాలలు, వైరా, కల్లూరు, అడవిమల్లెల, టేకులపల్లి, అంబేద్కర్ జూనియర్ కళాశాల, నేలకొండపల్లి, ఎర్రుపాలెం, మధిర, కూసుమంచి, దానవాయిగూడెం బాలికల గురుకుల పాఠశాలలు,ఖమ్మంలోని మహిళా డిగ్రీ కళాశాల అవసరాల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కూరగాయలకు రూ.60,000, కేటరింగ్ సేవలకు రూ.1,00,000, పండ్ల సరఫరాకు రూ.70,000, స్కిన్‌లెస్ చికెన్, మటన్ సరఫరాకు రూ.70,000, స్టేషనరీ సామగ్రికి రూ.1,00,000, ల్యాబ్ మెటీరియల్‌కు రూ.40,000 ధరావత్ నిర్ణయించినట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన అభ్యర్థులకు ధరావత్ మొత్తంలో 40 శాతం రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు.
ఆసక్తి గల వారు రూ.1,000 డిమాండ్ డ్రాఫ్ట్‌ను ప్రిన్సిపాల్, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీ (బాలికలు), టేకులపల్లి, ఖమ్మం పేరిట ఎస్‌బీఐ బ్యాంకులో చెల్లించి టెండర్ దరఖాస్తు ఫారాలను పొందవచ్చని తెలిపారు. టెండర్ ఫారాలు జూన్ 6 నుండి జూన్ 16 వరకు కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన సీల్డ్ టెండర్లను జూన్ 17 సాయంత్రం 4.00 గంటలలోపు టెండర్ బాక్సులో వేయాలని, గడువు అనంతరం టెండర్లు స్వీకరించబడవని స్పష్టం చేశారు. అందిన టెండర్లను జూన్ 18 ఉదయం 10.30 గంటలకు ఖమ్మంలోని నూతన ఐడీఓసీ భవనంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కొనుగోలు కమిటీ సమక్షంలో తెరవనున్నట్లు తెలిపారు. టెండర్లకు సంబంధించిన తేదీలు, విధివిధానాలు, షరతులలో మార్పులు చేయడం, రద్దు చేయడం లేదా వాయిదా వేయడం వంటి అంశాల్లో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్‌కు పూర్తి అధికారాలు ఉన్నాయని తెలిపారు. టెండర్లకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ జిల్లా సమన్వయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా సమన్వయ అధికారి ఎం. సునీత సూచించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలి

### - ఎస్ఐఆర్ పై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్




ఖమ్మం, జూన్ 04(ప్రజా కలం న్యూస్ )

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు విలాస్ దుబే, అమృత గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ శిక్షణ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు ఎన్యుమరేషన్ ఫారాల ముద్రణ, పంపిణీ, ఓటర్ల నుంచి స్వీకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేయడం, డేటా నమోదు, ధృవీకరణ ప్రక్రియలు,తదితర అంశాలపై అధికారులకు శిక్షణ అందించారు. శిక్షణ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులతో మాట్లాడుతూజిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిన వాటిని, సూపర్వైజర్లు మ్యాపింగ్‌ను మరోసారి క్షుణ్ణంగా ధృవీకరించాలని సూచించారు. 2002 ఎస్ఐఆర్ ఓటర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను తప్పనిసరిగా మ్యాప్ చేసి క్రాస్ వెరిఫికేషన్ నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, రాజకీయ పార్టీలకు అనుబంధం లేని వాలంటీర్లను గుర్తించి వారికి తగిన శిక్షణ అందించాలని ఆదేశించారు. మ్యాపింగ్ పూర్తైన అనంతరం మిగిలిన ఓటర్లందరి నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో నమోదయ్యే ఎపిక్ నంబర్‌తో పాటు ఇతర వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా బీఎల్‌వోలకు పూర్తి స్థాయి శిక్షణ అందేలా సూపర్వైజర్లు పర్యవేక్షించాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఫారాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్ఓ, ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మునికూడలిలో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

### వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ కావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రాజానగరం : రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతను, పురోగతిని పర్యవేక్షించిన ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ గారు, సంబంధిత అధికారులకు మరియు కాంట్రాక్టర్‌కు పలు కీలక సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు సకాలంలో అందేలా చూడటమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులను ఎలాంటి అలసత్వం లేకుండా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సిఐ చిన్న మల్లయ్యని ఉద్యోగం నుంచి తొలగింపు

పల్నాడు : అత్యాచారం కేసులో పరారీలో వున్న సిఐ చిన్న మల్లయ్యను పోలీసు ఉన్నతాధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. తనపై అత్యాచారం చేశాడని సిఐ చిన్న మల్లయ్యపై వినుకొండలో మహిళ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 29న సిఐ చిన్న మల్లయ్యపై వినుకొండలో మహిళ ఫిర్యాదు చేసింది. మహిళ ఫిర్యాదుతో వినుకొండలో సిఐ చిన్నమల్లయ్యపై అత్యాచారం కేసు నమోదు అయింది. కేసు నమోదు తర్వాత అజ్ఞాతంలోకి చిన్న మల్లయ్య వెళ్లాడు. ఈ నేపథ్యంలో సిఐ చిన్న మల్లయ్యని శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగిస్తూ ఐజి ఉత్తర్వులు జారీ చేసారు. బుధవారం నాడు పల్నాడు జిల్లా ఎస్పి కార్యాలయానికి మల్లయ్య డిస్మిస్ ఉత్తర్వులు చేరాయి.

## కేజీబీవీ సిబ్బంది బదిలీల్లో లొల్లి

ఒంగోలు : ఉమ్మడి జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీల్లో లొల్లి జరిగింది. బదిలీల నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తాయి. కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు నిర్వహించినా కొందరికి అన్యాయం జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు తాము కోరుకున్న స్థానాలు కాకుండా ఎక్కడో దూర స్థానాలు కేటాయించారని విమర్శలు ఎక్కుపెట్టారు. ఈ నేపథ్యంలో బదిలీల్లో అనుకూలమైన స్థానాలు దక్కించుకున్నవారు ఒక వర్గంగా, కోరుకున్న స్థానాలు దక్కనివారు మరో వర్గంగా విడిపోయి లొల్లికి దిగారు. సోమవారం రెండు వర్గాలు కలెక్టర్ రాజాబాబును కలిసి తమ గోడును విన్నవించారు. అనుకూలమైన స్థానాలు దక్కినవారు బదిలీలు బాగా జరిగాయని, వీటినే కొనసాగించాలని కలెక్టర్‌ను కోరారు. రెండో వర్గం బదిలీల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని, రద్దు చేసి రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని పట్టుబట్టారు. టీఎన్‌యూఎస్ నాయకులు కూడా జోక్యం చేసుకొని బదిలీల్లో అక్రమాల నేపథ్యంలో రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయించారు. రెండు రోజుల్లో సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసి పూర్తి వివరాలను తనకు సమర్పించాలని కలెక్టర్ అదేశించడంతో తదనుగు ణంగా సమగ్రశిక్ష అధికారులు తలమునకలవుతు న్నారు. ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న సిబ్బంది 334 మంది బదిలీలకు దరఖస్తులు చేసుకున్నారు.

**అంతా మౌఖికంగానే...** కేజీబీవీ బదిలీలకు సంబంధించి సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం నుంచి ఎటువంటి రాతపూర్వకంగా ఉత్తర్వులు రాలేదు. రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయ అధికారుల మౌఖిక ఆదేశాల మేరకు బదిలీలు చేపట్టారు. స్పష్టమైన మార్గద ర్శకాలు లేకపోవడంతో టీచర్ల బదిలీల ఉత్తర్వు ల్లోని కొన్ని అంశాలను ప్రామాణికంగా తీసుకొని స్థానికంగా మార్గదర్శకాలు రూపొందించి కలెక్టర్ ఆమోదంతో బదిలీలకు ముందుకు సాగారు. బదిలీ దరఖాస్తుకు కూడా ముందుగా ఎటువంటి ప్రకట నా విడుదల చేయకుండా వాట్సప్ గ్రూపుల ద్వారా సమాచారం ఇచ్చి దరఖాస్తులు స్వీకరించారు. ఆతర్వాత సీనియారిటీ జాబితాలు తయారు చేసి కేవలం ఒకరోజు ముం దు దరఖాస్తుదారులకు తెలియజేసి కౌన్సెలింగ్‌కు పిలిచారు.

## భారీ ఎత్తున గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్ : అంతరాష్ట్ర గంజాయి ముఠాను జూబ్లీహిల్స్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసారు. సస్పెన్షన్ లో ఉన్న శివకృష్ణ అనే సి.ఐ.ఎస్ .ఎఫ్ కానిస్టేబుల్ ను అరెస్ట్ చేసారు. శివకృష్ణ అనే వ్యక్తి కేరళలో పోలీస్ సి ఐ ఎస్ ఎఫ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహించేబాదు..అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. టాస్క్ ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ మాట్లాడుతూ నిందితుడినుంచి 79 లక్షల విలువైన 158 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. 2009 లో విధుల్లోకి చేరిన శివకృష్ణ ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నాడు. గతంలో ఇతనిపై రెండు కేసులు ఉన్నాయి..కేరళలో ఇతను విధులు నిర్వహించే క్రమంలో రెండుసార్లు పోలీసులకు పట్టుబడ్డాడు. ఒరిస్సా నుండి తీసుకువచ్చి మహారాష్ట్రకు వెళ్తుండగా ఎస్సార్ నగర్ లో పట్టుకున్నాము. సి ఐ ఎస్ ఎఫ్ నుండి సస్పెండ్ అయినప్పటికీ అతను నేర ప్రవృతి కొనసాగింది. మాదకద్రవ్యాల విషయంలో పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణా,సరఫరా పై ప్రత్యేక నిఘా ఉంటుంది. యువత, ఐటీ సెక్టార్ లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగింది. మాదకద్రవ్యాల కట్టడికి తీవ్రంగా శ్రమిస్తున్నామని అయన అన్నారు.

## పిడుగురాళ్లలో టిడిపి యూనిట్ సమావేశం

### - పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం సూచనలు

పిడుగురాళ్ల :జాతీయ తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం ప్రతినెల మొదటి జరుపు యూనిట్ సమావేశాలను పిడుగురాళ్ల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి చెన్నారావు ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ, పిడుగురాళ్ల పట్టణ పార్టీ అధ్యక్షులు పిల్లి చెన్నారావు, క్లస్టర్ ఇంచార్జిలు,యూనిట్ ఇన్చార్జీలు, బూత్ కన్వీనర్లు, వార్డు ఇన్చార్జిలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణ పై రేపు జరగబోవు సాఎఖీ ఓటర్ రివిజన్ లపై సమగ్రంగా చర్చించి తీసుకోబోవు జాగ్రత్తల గురించి ఓటర్ల నమోదు, ప్రతి నెల జరుగు పార్టీ సమావేశాల గురించి పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేయడం జరిగింది.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

డోన్ : ఉమ్మడి జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను డోన్ పట్టణంలో పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సునీల్ షెరాన్, డోన్ డీఎస్పీ పి.శ్రీనివాస్, పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, సీసీఎస్ నంద్యాల ఇన్స్పెక్టర్ పి.సురేష్ కుమార్ జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ దొంగలను పట్టుకునేందుకు డోన్, నంద్యాల పోలీసులతో పాటు సీసీఎస్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వేకువజాబున సుమారు 3.30 గంటలకు ఐటీసీ సిగరెట్ గోడౌన్‌లో సిగరెట్ల చోరీ కేసును చేధించిన పోలీసులు, ముగ్గురు నిందితులను పట్టణ శివార్లలోని గుత్తిరోడ్డు రుద్రాక్ష గుట్ట వద్ద ఉదయం 8.30 గంటలకు అరెస్టు చేశారని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేశారని, వీరు రాజస్థాన్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగలుగా గుర్తించామన్నారు. గత ఏప్రిల్ 20న ఐటీసీ సిగరెట్ గోడౌన్‌లో భారీగా కార్టన్లను అపహరించారన్నారు. వీటిని హైదరాబాదులో విక్రయించి నగదును వారి వద్దనే ఉంచుకున్నారు. అలాగే కడప పట్టణంలో కూడా ఇదే తరహా నలుగురు చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు.

**360తో గుర్తింపు...** ఎస్పీ ఆదేశాల మేరకు డోన్ డీఎస్పీ పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో డోన్ టౌన్ పోలీసులు, నంద్యాల సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ టీవీ 360 వ్యవస్థలో నమోదైన దృశ్యాలను విశ్లేషించి అనుమానితుల కదలికలను గుర్తించారు.

# గ్రామాల్లో ఇంటర్ నెట్ స్పీడ్ కోసం నయా కార్పొరేషన్

హైదరాబాద్ : తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తెలంగాణ రూరల్ ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ అమెండెడ్ భారత్ నెట్ పథకం కింద కేంద్ర, రాష్ట్రాల సమాన భాగస్వామ్యంతో ఇది పనిచేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు కేంద్రం కార్పొరేషన్ నిర్వహణ కోసం పదేళ్లకు రూ.2600 కోట్లు అలాగే తొలి విడతగా 3 లక్షల గ్రామీణ కనెక్షన్ల కోసం రూ.300 కోట్లు మంజూరు చేసింది. తెలంగాణలోని పల్లెపల్లెకూ హైస్పీడ్ డిజిటల్ నెట్‌వర్క్‌ను అనుసంధానం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విప్లవానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమెండెడ్ భారత్ నెట్ పథకంలో భాగంగా.. తెలంగాణ రూరల్ ఇంటర్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర టెలీకమ్యూనికేషన్ల శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో ఈ నూతన సంస్థ పనిచేయనుంది. ఈ కొత్త కార్పొరేషన్ బోర్డులో ఇరుపక్షాలకూ సమాన ప్రాధాన్యత కల్పించారు. బోర్డు సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక సీఈవోతో పాటు ఐటీ, ఆర్థిక, పంచాయతీరాజ్, ఇంధన శాఖల ఉన్నతాధికారులు నలుగురు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తరపున ఎక్స్ అఫీషియో ఛైర్మన్‌తో పాటు మరో నలుగురు డైరెక్టర్లు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో సేవలందిస్తున్న తెలంగాణ ఫైబర్‌గ్రిడ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ కొత్త కార్పొరేషన్‌కు కూడా సీఈవోగా అదనపు




బాధ్యతలు నిర్వర్తించనున్నారు. తెలంగాణకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా కొత్త కార్పొరేషన్ ఏర్పాటు నిబంధనల్లో కొన్ని కీలక వెసులుబాట్లు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి భారీ నిధులను ఆమోదించింది. కార్పొరేషన్ నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఇతర సాంకేతిక అవసరాల కోసం ఏటా రూ.260 కోట్ల చొప్పున.. రాబోయే పదేళ్ల కాలానికి గానూ మొత్తం రూ.2600 కోట్ల భారీ నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పాటు భారత్ నెట్ ఉద్యమీ ప్రోగామ్ కింద తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని మరింత వేగవంతం చేసేందుకు కేంద్రం ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా తొలి విడతలోనే రాష్ట్రంలోని పల్లెటూళ్లలో 3 లక్షల గృహాలకు ఉచిత ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఒక్కో కనెక్షన్‌కు రూ.10వేల చొప్పున మొత్తం రూ.300 కోట్లను కేంద్రం భరించనుంది. గతంలో నిర్మించిన భారత్ నెట్ ఫేజ్-1, 2 నెట్‌వర్క్‌లను అత్యాధునికంగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఇప్పటివరకు కనెక్టివిటీ లేని మారుమూల గ్రామాలకు ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఉన్న టీ-ఫైబర్ జిల్లా, మండల కేంద్రాల వరకే నెట్‌వర్క్‌ను నిర్వహిస్తుండగా.. కొత్తగా ఏర్పాటైన టీఆర్‌ఐఐసీఎల్ మండల కేంద్రాల నుండి చివరి గ్రామ స్థాయి వరకు ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లి దాని నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించనుంది.

# సెంటిమెంటే...ఆయింట్ మెంట్

## ఆత్మగౌరవ నినాదంతో అడుగులు

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ సెంటిమెంట్ తెరపైకి వస్తోంది. పదేళ్ల రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇప్పుడిప్పుడే పరిపాలన, అభివృద్ధి అంశాలపై చర్చ జరుగుతుందనుకుంటున్న తరుణంలో, మళ్ళీ ఆంధ్ర-తెలంగాణ భావోద్వేగాలను రగిల్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. తెలంగాణలో ప్రస్తుతం సాగుతున్న సెంటిమెంట్ రాజకీయాల వెనుక ప్రధానంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగాలు క్రియాశీలకంగా కనిపిస్తున్నాయి. గతంలో కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాలను తెరపైకి తెచ్చి ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిల్చేందుకు ప్రయత్నించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే, ఇప్పుడు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ టార్గెట్ గా జరుగుతున్న రాజకీయం, పవన్ కూడా తెలంగాణపై దృష్టి సారించడం, మంగళవారం జరిగిన సమావేశం పరిణామాలను ఆయుధంగా చేసుకుని తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో కొత్త ఉద్యమాన్ని లేవనెత్తాలని బీఆర్ఎస్ భావిస్తోంది. తద్వారా కోల్పోయిన రాజకీయ ఉనికిని మళ్ళీ చాటుకోవాలన్నది ఆ పార్టీ వ్యూహం. కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ సెంటిమెంట్ వేడి కనిపిస్తోంది. అనిరుధ్ రెడ్డి, మందుల సామ్యూల్ వంటి నేతలు ఏపీ నేతలను టార్గెట్ చేస్తూ చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ లైన్‌కు భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వీరు కూడా ప్రాంతీయ నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా




వ్యవహరిస్తున్నారు. ప్రాంతీయ సెంటిమెంట్ మళ్ళీ బలపడితే, ఆ సెంటిమెంట్‌కు పేటెంట్ హక్కు కలిగిన బీఆర్ఎస్‌కే అంతిమంగా లాభం చేకూరుతుందని రేవంత్ గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఆయన భావోద్వేగాల కంటే బాధ్యతాయుతమైన పరిపాలనకే మొగ్గు చూపుతున్నారు. రేవంత్ రెడ్డికి ఒక స్పష్టమైన అవగాహన ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌ను ఎన్నుకున్నది కేవలం సెంటిమెంట్ కోసం కాదు, మార్పు, పరిపాలన కోసం. ఇప్పుడు మళ్ళీ అదే సెంటిమెంట్ ఉచ్చులో పడితే, కాంగ్రెస్ తన అభివృద్ధి అజెండాను పక్కన పెట్టాల్సి వస్తుంది. పైగా, ఏపీతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలని ఆయన భావిస్తున్నారు. కానీ, తన సొంత పార్టీ నేతలు కొందరు కంట్రోల్ కాకుండా ఏపీపై విమర్శలు చేయడం ఆయనకు తలనొప్పిగా మారింది. రేవంత్ రెడ్డి ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి డ్యూయల్ స్ట్రాటజీ అమలు చేసే అవకాశం ఉంది. ఒకటి, పార్టీ నేతలకు కఠినమైన ఆదేశాలు జారీ చేయడం ద్వారా ఏపీ నేతలపై అనవసర వ్యాఖ్యలు చేయకుండా అడ్డుకోవడం. రెండు, బీఆర్ఎస్ చేస్తున్న సెంటిమెంట్ ప్రచారాన్ని రాజకీయ డైవర్షన్ గా ప్రజల్లోకి తీసుకెళ్లడం.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేయని పనులను ఇప్పుడు సెంటిమెంట్ పేరుతో కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని ఆయన వాదించనున్నారు. పవన్ కళ్యాణ్ ఫ్యాక్టర్ కూడా ఈ సమీకరణాల్లో కీలకం. పవన్‌ను టార్గెట్ చేయడం ద్వారా సెంటిమెంట్‌ను పెంచాలని బీఆర్ఎస్ చూస్తుంటే, రేవంత్ మాత్రం దాన్ని కేవలం ఒక పొరుగు రాష్ట్ర నేత పర్యటనగా మాత్రమే పరిగణించాలనే ధోరణిలో ఉన్నారు. తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయాలు అనేవి ఒక డబుల్ ఎడ్జ్ స్వోర్డ్ లాంటివి. రేవంత్ రెడ్డి ఈ సెంటిమెంట్ వేవ్ ను సమర్థవంతంగా అడ్డుకోగలిగితేనే కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది. ఒకవేళ తన పార్టీ నేతలను కంట్రోల్ చేయడంలో విఫలమైతే, అది బీఆర్ఎస్‌కు ఆక్సిజన్ అందించినట్లు అవుతుంది.

# కంటోన్మెంట్ ఎమ్మెల్యే తీరే 'సపరేట్',రోజుకో మాట.. పూటకో ప్రోగ్రామ్

## హామీలు ఘనం,అమలులో శూన్యం.కంటోన్మెంట్ వాణి,బస్తీబాట ప్రచార ఆర్భాటమే?

## రెండేళ్ల పదవీ కాలంలో ఏం సాధించారని ప్రజల ప్రశ్న - అభివృద్ధి నిధుల మాటేమో కానీ..ఎమ్మెల్యే కు బెంజ్ కార్



కంటోన్మెంట్, జూన్ 4: ప్రజాకలం ప్రతినిధి:

కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పదవీ రెండేళ్ల కాలం పూర్తవుతున్నా, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన తీరు మాత్రం అత్యంత నిరాశాజనకంగా ఉందని స్థానిక ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలో రోజుకో కార్యక్రమం, పూటకో పథకం పేరు చెప్పి ప్రజల్లోకి వెళ్తూ కాలం గడపడం తప్ప, గడిచిన రెండేళ్లలో ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టిన పెద్ద పథకం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదని నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది. హామీలు ఇవ్వడం ఆయనకు వెండితో పెట్టిన విద్యని, కానీ ఆ పథకాల అమలు కోసం ప్రజలు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూడటం తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు.

అటకెక్కిన పథకాలు.. అడుగు ముందుకు పడని పనులు

ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో 'కంటోన్మెంట్ వాణి' పేరుతో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేవలం రెండు వార్డులలో మాత్రమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులు స్వీకరించారు. అయితే, ఆ ఫిర్యాదుల్లో ఎన్ని పరిష్కారమయ్యాయో చెప్పే లెక్క పత్రం ఎక్కడా లేదు. ప్రతి నెల 10వ తేదీన 8 వార్డులలో 'కంటోన్మెంట్ వాణి' నిర్వహిస్తానని చెప్పిన ఎమ్మెల్యే, ఆ తర్వాత ఆ కార్యక్రమాన్ని కాలగర్భంలో కలిపేశారు. ఆ తర్వాత కొద్దిరోజులు 'బస్తీబాట' అంటూ నాలుగైదు బస్తీల్లో పర్యటించి..మురుగునీరు, తాగునీరు, వీధి దీపాల సమస్యలను స్వయంగా తెలుసుకుని, అధికారులతో మాట్లాడి చేతులు కడిగేసుకున్నారు. ఆ తర్వాత ఆ బస్తీబాట కూడా అటకెక్కింది. ఇప్పుడు తాజాగా 'నవ కంటోన్మెంట్ నిర్మాణం' పేరుతో ప్రజల ముందుకు వస్తున్నారు. అసలు ఈ నవ కంటోన్మెంట్ అంటే.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యక్రమమా? లేక పాత కార్యక్రమాల కొనసాగింపా? అనే విషయంపై ఎమ్మెల్యేకే స్పష్టత లేదని, ఆయన తీరు చూస్తుంటే "చెప్పేది కొండంత.. చేసేది గోరంత" అన్నట్లుగా ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అవకతవకలు..స్పోర్ట్స్ కాంప్లెక్స్ అతీగతీ లేదు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పునాది వేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టినప్పటికీ, అందులో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు మరియు అవకతవకలు చోటు చేసుకున్నాయని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై బాధితులు ధర్నాలు చేసినా స్థానిక ఎమ్మెల్యే స్పందించక పోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు ఎన్ని అని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు, సాక్షాత్తు ఇంచార్జ్ మంత్రి చేత శంకుస్థాపన చేయించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అసలు నిధులు వచ్చాయా లేదా అన్నది దేవుడెరుగు కానీ, నియోజకవర్గంలోని క్రీడాకారులను ఎమ్మెల్యే పూర్తిగా విస్మరించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నియోజకవర్గం నిధులేమో కానీ.. ఎమ్మెల్యేకు బెంజ్ కార్

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు రాక, ప్రజా సమస్యలు పరిష్కారం కాక ప్రజలు అల్లాడుతుంటే.. ఎమ్మెల్యే మాత్రం లగ్జరీ బెంజ్ కార్ లో తిరుగుతుండటంపై ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున నిలదీస్తున్నాయి. గతంలో ఆ బెంజ్ కార్ ఎలా వచ్చిందో బీఆర్ఎస్ నాయకులు పూర్తి వివరాలను బయటపెట్టారు. తాజాగా జరిగిన ఓ సమావేశంలో సదరు నేత ఎమ్మెల్యేను 'రెండువేల ఎమ్మెల్యే' అని సంబోధించినా ఆయనలో ఎలాంటి చలనం లేకపోవడం గమనార్హం. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో జరిగిన అక్రమాలపై కూడా ఎమ్మెల్యే ఏనాడూ నోరు విప్పలేదు.

ఓడ ఎక్కేదాకా ఒక మాట.. దిగాక ఇంకో మాట

ఓడ ఎక్కినాక ఓడ మల్లన్న.. ఓడ దిగినాక బోడి మల్లన్న అన్న చందంగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని నియోజకవర్గ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. 15 ఏళ్లు అధికారం కోసం ఆయన చేసిన సేవను, కేవలం ఈ ఏడాదినర పదవీ కాలంలోనే పోగొట్టుకున్నారని స్థానికులు అభిప్రాయపడు తున్నారు. ఉప ఎన్నికల్లో గెలిచినప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి సమస్యను పరిష్కరిస్తానని చెప్పిన ఆయన, ఇప్పుడు ఎన్ని సమస్యలు పరిష్కరించారో, ఎన్ని నిధులు తెచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలు పక్కన పెట్టి, నిధులు తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కంటోన్మెంట్ ప్రజలు కోరుతున్నారు. మరి ఎమ్మెల్యే ఇప్పటికైనా అటువైపు అడుగులు వేస్తారా? లేక తన పంథాలోనే ముందుకు సాగుతారా? అనేది వేచి చూడాలి.



# పంచాయితీల తర్వాతే మున్సిపాల్టీలు




విశాఖపట్టణం : ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. పంచాయితీతోపాటు మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పంచాయతీల పాలకవర్గం ముగిసింది. కొత్తగా ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. మున్సిపాలిటీలకు సైతం ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా వచ్చారు. అయితే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. రెండేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని కూటమి భావిస్తోంది. ఎన్నికల నిర్వహణకు ఇదే సమయం అని అంచనా వేస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం స్థానిక ఎన్నికలకు సిద్ధపడుతోంది. ప్రతిచోట వైసీపీ అభ్యర్థి బరిలో ఉండాల్సిందేనని.. లేకుంటే మాత్రం వైసిపి ఇన్చార్జ్ పై వేటు వేస్తామని జగన్మోహన్ రెడ్డి హెచ్చరించారు. మరోవైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిస్తున్నారు.కూటమి ప్రభుత్వపరంగా ఈనెల కీలకం. ముఖ్యంగా ఇదే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకారుల భరోసా వంటి పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. దీంతో ప్రజల్లో సంతృప్తి శాతం పెరుగుతుందని అంచనా వేస్తోంది. మరోవైపు కొత్త పింఛన్లకు సంబంధించిన బిగ్ అప్డేట్ వచ్చింది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. కొత్త పింఛన్లు మంజూరు చేసి.. ప్రజల్లో మరింత సంతృప్తి సాధించి.. ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో కూటమి ఉంది. అయితే జూలై నుంచి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైగా పంచాయతీలు ఉన్నాయి. వీటికి ఏప్రిల్ నాలుగు తో పదవీకాలం గడువు ముగిసింది. అప్పటినుంచిప్రత్యేక అధికారులను నియమించారు.మరోవైపు ఏప్రిల్ నుంచి 16వ ఆర్థిక సంఘం గడువు ప్రారంభం అయింది.పంచాయితీలకు పాలకవర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు దక్కేవి.అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. వీలైనంతవరకు పంచాయితీలను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేసే అవకాశం కనిపిస్తోంది. కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకోవద్దు అని జగన్మోహన్ రెడ్డిగట్టిగానే చెప్పారు. అయితే క్యాడర్మాత్రం విముఖత వ్యక్తం చేస్తోంది. స్థానిక ఎన్నికలు అంటేనే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. పైగా ఆర్థిక భారం తప్పేలా లేదు.కానీ అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరిచూస్తుంటే తప్పనిసరిగా బరిలో ఉండాల్సిందేనని చెబుతున్నారు. కానీ పార్టీ శ్రేణులు మాత్రం పులివెందుల జడ్పిటిసిఎన్నికలను గుర్తుచేసుకొని భయపడుతున్నారు.

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 110 కి పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఉన్నాయి. పట్టణాలతో పాటు నగరాల్లో కూటమికి సంతృప్తికర వాతావరణముంది. పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతుండడంతో అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్కడ కూడా కూటమి సత్తా చాటాలని చూస్తోంది. కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలు కాకుండా పోటీ చేయించాలన్న ఆలోచనలో వైసిపి ఉంది. కానీ వైసీపీ క్యాడర్ మాత్రం అందుకు సుముఖంగా లేదు. కానీ అధినేత జగన్మోహన్ రెడ్డి పట్టుబడుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ చేయాల్సి ఉంటుంది.

**పార్టీ కోసం కష్టపడిన వారికే టికెట్లు..!**

ఇటు పార్టీ అగ్రనేతల కామెంట్స్..మరోవైపు ఎన్ఈసీ డెవలప్మెంట్స్తో.. ఏపీలో స్థానిక ఎన్నికల సందడి ఊపందుకుంటోంది. ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండటంతో టీడీపీ ఈ ఎలక్షన్స్ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గెలుచుకున్న స్థానాలను తిరిగి కైవసం చేసుకుని పసుపు జెండా రెపరెపలాడించాలని పట్టుదలతో ఉంది. మహానాడు వేదికపైనా స్థానిక ఎన్నికలపై చర్చ జరిగింది. పార్టీ జెండా మోసిన వారికి పోటీ అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు వెళ్లాయంటున్నారు.పార్టీ కోసం కష్టపడిన వారికి కచ్చితంగా టికెట్లు ఇస్తామని సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని సంకేతాలిచ్చారాయన. ఇక ఇదే సందర్భంలో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా స్థానిక ఎన్నికలపై గురిపెట్టారు. ఏకగ్రీవాలు కాకుండా చూడాలని, ప్రతి స్థానంలోనూ పోటీ ఉండేలా అభ్యర్థులను ఇప్పటినుంచే రెడీ చేయాలని లీడర్లకు సూచించారు. దీంతో ఒక్కసారిగా ఏపీలో పొలిటికల్ హీట్ కాక రేక రేపుతోంది.స్థానిక ఎన్నికల్లో టీడీపీ, వైసీపీల మధ్యే గట్టి పోటీ ఉండే పరిస్థితి కనిపిస్తోంది. కూటమిలో జనసేన, బీజేపీకి సీట్లు కేటాయించిన చోట..పరిస్థితులు తమకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ భావిస్తోంది. 2021-22లో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతం స్థానాలను సొంతం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో 100 శాతం స్థానాలను గెలుచుకోవాలని టీడీపీ యోచిస్తోంది. వైసీపీపై రాజకీయ ప్రతీకారం తీర్చుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన కూడా కీలక స్థానాల్లో పోటీ చేసే యోచనలో ఉంది. ఆయా జిల్లాల నుంచి ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కీలకమైన వార్డులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.మరోవైపు బీజేపీ కూడా తమకు బలం ఉన్నచోట అభ్యర్థులను పోటీలోకి దించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఎన్నికలకు దూరంగా ఉండాలా..లేక పోటీ చేయాలా అనే డైలామాలో ఉన్న వైసీపీ ఇక అమీతుమీ తేల్చుకునేందుకు రెడీ అయినట్లు కనిపిస్తోంది. అధికార పక్షంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఫ్యాన్ పార్టీ..స్థానిక ఎన్నికల్లో గెలుపు గుర్రాలను రంగంలోకి దించేందుకు సర్వం సిద్ధం చేస్తోందట. రాష్ట్రస్థాయి కీలక నేతల సమావేశంలో స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు జగన్. ముఖ్యంగా ఏకగ్రీవాలు కాకుండా చూడాలని, అలా జరిగితే నియోజకవర్గ ఇంచార్జ్ల ఫెయిల్యూర్గా భావించాల్సి వస్తుందని ముఖ్యనేతలను హెచ్చరించారు. దీంతో స్థానిక పోరు విషయంలో తగ్గేదేలే అన్న ఇండికేషన్ పంపించారు వైసీపీ అధినేత జగన్.ఉమ్మడి 13 జిల్లాల పరిధిలో దాదాపు 13 వేల 326 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి న్యాయపరమైన చిక్కుల కారణంగా గతంలో ఎన్నికలు నిర్వహించ లేదు. ఇప్పుడు అన్ని పంచాయతీలకు ఎలక్షన్స్ జరిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే 660 జడ్పీటీసీ స్థానాలు, 10వేల 47కి పైగా ఎంపీటీసీ స్థానాలకు ఎలక్షన్స్ పెట్టనుండటంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతోంది. అలాగే రాష్ట్రంలో 13 కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన ప్రకారం 920కు వార్డుల సంఖ్య పెరిగింది. 75 మున్సిపాలిటీల పరిధిలో దాదాపు 2 వేలకు పైగా వార్డులు ఉన్నాయి. వీటన్నింటికీ కూడా రెండు విడతల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు స్టేట్ ఈసీ కసరత్తు చేస్తోంది.

# మాకో అవకాశం ఇవ్వండి

విజయవాడ : తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ పదవులపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. అందులో సీనియర్ నేతలు ఎక్కువ మంది ఈ పదవిని ఆశిస్తున్నారు. కానీ పదవులు తక్కువ.. ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. ఇది టీడీపీ నాయకత్వానికి కొంత ఇబ్బందిగా మారే అవకాశముంది. తాము పార్టీ కోసం పడిన కష్టాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ ను కలిసి తమ వినతులను సమర్పించారు. తమకు పెద్దల సభలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కానీ నాయకత్వం మాత్రం రాజ్యసభ స్థానాల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి వచ్చింది.వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహన్ రావు వంటి నేతలు తమకు రాజ్యసభ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా కీలక కామెంట్స్ చేశారు. తన తర్వాత తన కుటుంబానికి కూడా రాజకీయంగా సేవ చేసే అవకాశం ఇవ్వాలని అయ్యన్న పాత్రుడు కోరారు. ఇరవై ఐదేళ్ల వయస్సు నుంచి టీడీపీలో సేవలందిస్తున్నానన్న ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తన కుటుంబానికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. అంటే పరోక్షంగా తన కుమారుడు చింతకాయల విజయ్ ను రాజ్యసభకు పంపాలని కోరినట్లు నాయకత్వానికి చెప్పకనే చెప్పినట్లయింది.తెలుగుదేశం పార్టీ కోసం జీవితాంతం పనిచేశానని అయ్యన్న పాత్రుడు భావోద్వేగంగా మాట్లాడారు. తన కుటుంబ సభ్యులకు కూడా పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరిన స్పీకర్ అయ్యన్న అందుకు అవకాశమివ్వాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. త్వరలో రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్న సమయంలో అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. టీడీపీలో రాజ్యసభ ఆశావహుల మధ్య అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. మరి రాజ్యసభకు టీడీపీ నాయకత్వం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది మాత్రం చివరి వరకూ సస్పెన్స్ గా కొనసాగే అవకాశముంది.

# టీడీపికి కలిసి రాని రాజ్యసభ

విజయవాడ : తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ ఎన్నికల సందడి ఊపందుకుంది. రాష్ట్రంలో కూటమికి ఉన్న భారీ మెజారిటీ కారణంగా ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలనూ కైవసం చేసుకోవడం నల్లేరుపై నడకే. అయితే, ఈ విజయోత్సాహం నడుమ పార్టీలో ఒక ఆసక్తికరమైన, పాత వివాదం మళ్ళీ తెరపైకి వచ్చింది. 1984 లో ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు పెద్దల సభకు వెళ్లిన నేతల చరిత్రను గమనిస్తే.. రాజ్యసభ సభ్యులు టీడీపీకి ఎప్పుడూ కలిసి రాలేదు అనే సెంటిమెంట్ క్యాడర్లో బలంగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు దాదాపు 46 మంది నేతలు ఆ పార్టీ తరపున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. అయితే ఈ సుదీర్ఘ చరిత్రలో ఒక చేదు నిజం పార్టీని నిరంతరం వెంటాడుతోంది. టీడీపీ తరపున ఒకసారి కంటే ఎక్కువసార్లు రాజ్యసభకు వెళ్లిన నేతలలో అత్యధికులు కీలక సమయంలో పార్టీకి హ్యాండ్ ఇచ్చి వలస బాట పట్టారు. నాడు ఎన్టీఆర్ హయాంలో పార్టీలో అత్యంత కీలక చక్రం తిప్పిన పి. ఉపేంద్ర కాలం నుంచి.. నిన్నమొన్నటి సుజనా చౌదరి, సీఎం రమేష్ వరకు ఈ జాబితా చాలా పెద్దదిగానే ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలవాల్సిన ఈ పెద్దలు .. సొంత ప్రయోజనాల కోసం లేదా కేసుల భయంతో పార్టీ లైన్ దాటడం ప్రతిసారీ క్యాడర్ను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.టీడీపీ చరిత్రలోనే అత్యంత ఘోరమైన పరాజయాన్ని మూటగట్టుకున్న 2019 ఎన్నికల తర్వాత ఈ రాజ్యసభ సభ్యుల వలసలు పరాకాష్టకు చేరాయి. అప్పట్లో టీడీపీకి ఉన్న ఆరుగురు రాజ్యసభ సభ్యుల్లో నలుగురు సుజనా చౌదరి, సి.ఎం. రమేష్, టి.జి. వెంకటేష్, గరికపాటి మోహన్ రావు ఒకేసారి గ్రూప్గా మారి, రాజ్యసభలో టీడీపీ పక్షాన్ని ఏకంగా బీజేపీలో విలీనం చేసేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం రెండు పైగా మూడు వంతుల మెజారిటీని వాడుకుని, అనర్హత వేటు పడకుండా వీరు సేఫ్గా కమలం గూటికి చేరిపోయారు. అంతకుముందు చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తులుగా, ఢిల్లీలో పార్టీ ముఖచిత్రాలుగా వెలిగిన వీరే.. పార్టీ ఓడిపోగానే పక్కదారి పట్టడం చంద్రబాబు రాజకీయ వ్యూహాల లోపాన్ని ఎత్తిచూపింది.ఈ వరుస వలసల వెనుక ఉన్న అసలు కారణంపై టీడీపీ క్షేత్రస్థాయి క్యాడర్, సీనియర్ లీడర్లలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. ఎలక్షన్ల సమయంలో పార్టీ గెలుపు కోసం రాత్రింబవళ్లు లాఠీ దెబ్బలు తింటూ, జైళ్లకు వెళ్లే గ్రౌండ్ లెవెల్ లీడర్లను పక్కన పెట్టి.. కేవలం ఫండింగ్ చేసేవారికి, తెర వెనుక చక్రం తిప్పే కార్పొరేట్ శక్తులకే చంద్రబాబు రాజ్యసభ సీట్లు ఇస్తారనే విమర్శ మొదటి నుండి ఉంది. ఢిల్లీలో లాబీయింగ్‌లు నడపడానికి, వ్యాపార ప్రయోజనాలు కాపాడుకోవడానికి వచ్చే ఇలాంటి పారాచూట్ నేతలకు పార్టీ సిద్ధాంతాల పట్ల గానీ, కార్యకర్తల కష్టం పట్ల గానీ ఎలాంటి నిబద్ధత ఉండదు. అందుకే, అధికారం మారగానే వీరు తమ వ్యాపారాలను, కాంట్రాక్టులను కాపాడుకోవడానికి అధికార పార్టీలోకి జంప్ అయిపోతుంటారని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది.ప్రస్తుతం జూన్ 2026 లో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో మళ్లీ లాబీయింగ్ మొదలైంది. కూటమి ఒప్పందంలో భాగంగా జనసేనకు ఒక సీటు కేటాయించగా, మిగిలిన మూడు సీట్లు టీడీపీ దక్కించుకోనుంది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న సానా సతీష్ బాబు తో పాటు పాత కార్పొరేట్ ముఖాలు మళ్లీ సీట్ల కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈసారి నారా లోకేష్ నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక జరుగుతుండటంతో.. యువతకు, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న బీసీ, ఎస్సీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాత తప్పులను పునరావృతం చేయవద్దని కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు. ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ స్థాయిలో తన వాయిస్ బలంగా వినిపించాలంటే రాజ్యసభ సభ్యుల పాత్ర కీలకం. కానీ టీడీపీ విషయంలో ఈ సభ్యులు కేవలం పవర్ బ్రోకర్లు గా మిగిలిపోతున్నారనేది నిజం.

సురేష్ ప్రభు లాంటి బయటి వ్యక్తులకు కూడా గతంలో టీడీపీ సీటు ఇచ్చింది. ఈ ధోరణి మారకపోతే, భవిష్యత్తులో కూడా ఈ సీట్లు పార్టీకి కేవలం తాత్కాలిక అవసరాలకే ఉపయోగపడతాయి తప్ప, నమ్మకమైన లీడర్‌షిప్‌ను తయారు చేయలేవు. చంద్రబాబు నాయుడు ఈ ఎన్నికల్లో కేవలం ఆర్థిక అంగబలాన్ని మాత్రమే చూడకుండా, రాజకీయ అంగబలం, నమ్మకమైన చరిత్ర ఉన్నవారికే పెద్దల సభకు పంపితేనే ఈ రాజ్యసభ శాపం నుంచి టీడీపీ బయటపడగలదని టీడీపీ క్యాడర్ అభిప్రాయం.

# టార్గెట్ 100... జగన్ నయా లెక్కలు



విజయవాడ : రాజకీయాల్లో పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మారడం సహజం. అయితే భారీ విజయాలను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లిన పార్టీలు అనూహ్య ఫలితాలు ఎదుర్కొన్నప్పుడు తమ కార్యాచరణను తిరిగి సమీక్షించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా ఇలాంటి చర్చలే జరుగుతున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల సమయంలో వై నాట్ 175 అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసిన పార్టీ, ఎన్నికల ఫలితాల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడంతో భవిష్యత్ వ్యూహాలపై అంతర్గతంగా మంతనాలు ప్రారంభమైనట్లు సమాచారం.ఇటీవల నిర్వహించిన పార్టీ సమావేశాల్లో నాయకుల మధ్య కొత్త ఎన్నికల లక్ష్యాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో అత్యంత భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని కొందరు అభిప్రాయపడ్డారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిమిత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచనలు వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కొంతమంది నాయకులు 175 స్థానాలపై దృష్టి కేంద్రీకరించడం కంటే, గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న సుమారు 100 నియోజకవర్గాలను గుర్తించి ప్రత్యేక వ్యూహంతో పని చేయాలని అభిప్రాయపడినట్లు సమాచారం. బలమైన స్థానాల్లో పార్టీ శక్తిని కేంద్రీకరించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని వారు వివరించినట్లు తెలుస్తోంది.అలాగే ఆయా నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వాన్ని మరింత చురుకుగా మార్చడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. గత ఎన్నికల అనుభవాల ఆధారంగా బలహీనతలను గుర్తించి వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారని చెబుతున్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్ తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ అంశంపై అధికారిక స్పష్టత వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.ఇక పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణ రెడ్డిసమావేశంలో లక్ష్యాల సంఖ్యను తగ్గించుకోవడంపై కాకుండా గెలుపు అవకాశాలను పెంచే మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ప్రజల మద్దతు, సమర్థవంతమైన ప్రచారం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారని సమాచారం.మరోవైపు రానున్న కాలంలో నిర్వహించే ప్రజా కార్యక్రమాలు, ముఖ్యంగా పార్టీ అధినేత చేపట్టనున్న పాదయాత్ర తర్వాత రాజకీయ పరిస్థితులను అంచనా వేసి తుది వ్యూహాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అప్పటి వరకు అన్ని నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పార్టీ పెద్దలు సూచించినట్లు సమాచారం. ఎన్నికల లక్ష్యాల కంటే ప్రజల్లో మళ్లీ విశ్వాసాన్ని పెంపొందించుకోవడంపైనే ప్రస్తుతం పార్టీ ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# కమలానికి ఏమైంది?

నెల్లూరు : ఏపీలో బిజెపి ప్రక్షాళన దిశగా హై కమాండ్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పార్టీ నేతల వ్యవహార శైలిపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ అభివృద్ధిపై నేతలు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. పార్టీని బలోపేతం చేయడం లేదు. దీనిపై హై కమాండ్ కు స్పష్టమైన సమాచారం ఉంది. అందుకే నేతల తీరుపై పెద్దలు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ముఖ్యమైన నేతను పిలిచి గట్టిగానే క్లాసు పీకినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడి ఎదుట నేతల పనితీరు, వ్యవహార శైలి బయట పెట్టినట్లు సమాచారం. అందుకే మొత్తం మార్పు దిశగా అడుగులు వేస్తామని హెచ్చరించినట్లు తెలుస్తోంది.ఏపీలో భారతీయ జనతా పార్టీ కనీసం సొంతంగా ఉనికి చాటుకునే పరిస్థితిలో లేదు. తెలుగుదేశం పార్టీతో కలిసిన సమయంలో మాత్రమే ఓట్లతో పాటు సీట్లు పెరుగుతున్నాయి. ఒంటరిగా పోరాటం చేస్తున్న ప్రతిసారి ఒక్క నియోజకవర్గంలో కూడా డిపాజిట్లు రావడం లేదు. 2014లో టిడిపి తో కలిసి పోటీ చేస్తే ఎమ్మెల్యే తో పాటు ఎంపీ స్థానాలను దక్కించుకుంది బిజెపి. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఎనిమిది ఎమ్మెల్యేలతో పాటు రెండు పార్లమెంట్ స్థానాలు ఆ పార్టీకి దక్కాయి. అయితే ఇప్పుడు కూడా ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. కనీసం పార్టీ కోసం పట్టించుకునే వారు కరువవుతున్నారుబిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన పివిఎన్ మాధవ్ పార్టీని అభివృద్ధి చేస్తారని హైకమాండ్ భావించింది. ఆయనపై చాలా రకాలుగా అంచనాలు పెట్టుకుంది. కానీ ఎందుకో ఆయన ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు. ప్రారంభంలో హడావిడి చేశారు. తరువాత ప్రెస్ మీట్ లకే పరిమితం అవుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శలు ఉన్నాయి. పార్టీకి పెద్దదిక్కుగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఆయనకు ఢిల్లీలో పరపతి ఉంది. సీఎం చంద్రబాబు వద్ద గౌరవం ఉంది. అందుకే ఆయన కేంద్ర ప్రభుత్వపరంగా, రాష్ట్ర ప్రభుత్వపరంగా పనులు చేసుకుంటున్నారు. స్థానికంగా పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శ ఉంది. దగ్గుబాటి పురందేశ్వరి పరిస్థితి కూడా అదే. మొన్నటి ఎన్నికల వరకు ఆమె బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలుగా ఉండేవారు.

ఇప్పుడు రాజమండ్రి ఎంపీగా కూడా ఉన్నారు. కనీసం వారంలో ఒక్కరోజు కూడా ఆమె అందుబాటులో ఉండడం లేదు. ఆమె తరుపున కూడా ఎవరు లేకుండా పోయారు పార్లమెంట్ నియోజకవర్గంలో. ఇవన్నీ పార్టీ దృష్టికి వెళ్లాయి కూడా.. అందుకే హై కమాండ్ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. మూడు పార్టీలు కలిసి వెళ్తాయి. కానీ క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీకి బలం లేదు. ఆ బలం పెంచుకునే ప్రయత్నం కూడా జరగలేదు. జిల్లా కమిటీలు ఉన్నాయంటే ఉన్నాయి. కనీసం గ్రామస్థాయి కమిటీలు లేవు. మండల కమిటీలు కానరావు. నియోజకవర్గాలు ఇన్చార్జులు ఉన్న ఫలితం లేదు. వాస్తవానికి భారతీయ జనతా పార్టీ ఇతర రాష్ట్రాల్లో బూత్ లెవెల్ లో బలమైన కమిటీలు ఉంటాయి. కానీ ఏపీ విషయానికి వచ్చినప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ఇలానే కొనసాగితే ఏపీ బీజేపీలో ప్రక్షాళనకు హైకమాండ్ ప్రయత్నించే అవకాశం ఉంది. కచ్చితంగా చాలా రకాల మార్పులకు ఆ పార్టీ పెద్దలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.


# కాంట్రవర్సీకి కేరాఫ్‌గా ఎమ్మెల్యే థామస్

## ఎస్సీ ఎమ్మెల్యేలకు గౌరవం లభించట్లేదని కామెంట్స్

తిరుపతి : చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ రూటే సపరేటు. డాక్టర్ వృత్తిలో ఎప్పుడు బిజీగా ఉండే ఆయన అప్పుడప్పుడు హాట్ కామెంట్స్ చేసి న్యూస్ హెడ్‌లైన్‌గా మారుతున్నారు. ఎస్సీ రిజర్వ్డ్ నియోజకవర్గ ఎమ్మెల్యేలకు తగిన గౌరవం లభించడం లేదంటూ గతంలో ఆయన చేసిన కామెంట్స్ దుమారం లేపాయి. ఇదే విషయంపై పలుమార్లు తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు కూడా. లేటెస్ట్‌గా మరోసారి షాకింగ్ కామెంట్స్ చేశారు ఎమ్మెల్యే థామస్.మీడియా సమావేశం సాక్షిగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసి..సొంత ఎమ్మెల్యేలు, పార్టీ అధిష్టానం ఆగ్రహానికి గురయ్యారు. ఎస్సీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో మట్టి అక్రమ రవాణతో సహా ఏ చిన్న ఘటన జరిగినా మీడియాలో హైలెట్ చేస్తారని..అదే అగ్రవర్ణ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఏం జరిగినా వాటిపై మీడియాలో కథనాలు రావడం లేదంటూ థామస్ చేసిన వ్యాఖ్యలు సెన్సేషన్‌గా మారాయి. అంతటితో ఆగకుండా ఆయన..పక్కనే ఉన్న చంద్రగిరి, నగరి నియోజకవర్గాల నుంచి మట్టి అక్రమంగా బయటకు వెళ్లడం లేదా? వాటిని ఎందుకు ఎవరూ పట్టించుకోవడం లేదంటూ..మరింత వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.ఈ మాటలు వైరల్ అయ్యాయి. ఆయన వ్యాఖ్యలు స్వతహాగానే చంద్రగిరి, నగరి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాశ్‌లకు ఆగ్రహం తెప్పించినా..సొంత పార్టీ సహచర ఎమ్మెల్యే కావడంతో కౌంటర్ ఇవ్వకుండా మిన్నకుండిపోయారు. చివరకు థామస్ కామెంట్స్ పార్టీ అధిష్టానం చెవిన పడటంతో పార్టీ పెద్దలు సీరియస్ అయినట్లు తెలుస్తోంది. టీడీపీ స్టేట్ చీఫ్ పల్లా శ్రీనివాస్, థామస్‌ను సంజాయిషీ అడిగినట్లు తెలుస్తోంది. దీంతో పల్లా శ్రీనివాస్ ను కలిసి తాను చేసిన వ్యాఖ్యలపై థామస్ వివరణ ఇచ్చారు. తన మాటలను వక్రీకరించారని, ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేయబోనని చెప్పినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ విప్‌గాను కొనసాగుతున్న ఎమ్మెల్యే థామస్‌ను పార్టీ గట్టిగానే మందలించినట్లు చర్చించుకుంటున్నారు.జిల్లాకు చెందిన కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు మాత్రం థామస్ తీరుపై కొంతకాలంగా గుర్రుగానే ఉన్నారట. ఎస్సీ ఎమ్మెల్యేలు, అగ్రవర్ణ ఎమ్మెల్యేలు అంటూ జిల్లాలో ఎమ్మెల్యేలను విడదీసే ప్రయత్నం చేస్తున్నారంటూ మండిపడుతున్నారట. తనపై ఆరోపణలు వస్తే వాటిని ఖండించాల్సింది పోయి.

# వేలూరు రహదారిపై గాయాలతో వ్యక్తి మృతదేహం లభ్యం

చిలకలూరిపేట:చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామంలో వేలూరు గ్రామం నుండి జాలాది వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఒక వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానిక గ్రామస్తులు గమనించారు. రోడ్డుపై మృతదేహం ఉండటంతో భయాందోళనకు గురైన స్థానికులు, వెంటనే చిలకలూరిపేట రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. దీంతో ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా (హత్య జరిగి ఉండవచ్చనే కోణంలో) పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



## ఘనంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు జన్మదిన వేడుకలు

కూకట్ పల్లి, జూన్ 04, ప్రజా కలం ప్రతినిధి:

శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు జన్మదిన సందర్భంగా కూకట్ పల్లి బాలకృష్ణనగర్ లో గల వృద్ధి బ్యాంక్వెట్ హాల్ నందు కూకట్ పల్లి మాజీ కార్పొరేటర్లు మరియు స్థానిక నాయకులతో కలసి కేక్ కట్ చేసిన రంగారావు. ఈ సందర్భంగా రంగా రావు మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ కార్పొరేటర్లకు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు, మహిళ నాయకురాలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టుముకుల పెద్ద భాస్కర్ రావు, భద్రయ్య, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సంతోష్, ప్రభాకర్, తులసీరావు, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.



## రాంసాగర్‌లో గోశాలలో అగ్నిప్రమాదం..

సిద్దిపేట ప్రజాకలం జూన్ 04.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని రాంసాగర్ గ్రామంలో సోమవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా గోశాలలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గోశాలలో నిల్వ ఉంచిన సుమారు 250 గడ్డి కట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి.సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది, రాయపోల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదానికి గల పూర్తి కారణాలు, ఇరువై వేల ఆస్తి నష్టం జరిగిందని అధికారులు వివరాలు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.




## పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇళ్లు

### మహేశ్వరం నియోజకవర్గానికి 3500 గృహాలు
### త్వరలో అన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి
### మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, జూన్ 04,(ప్రజా కలం)

పేదల ఆత్మగౌరవం పెంచేలా ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు.తొలి విడతలో మహేశ్వరం నియోజకవర్గానికి 3500 గృహాలకు తెలంగాణ ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు కె ఎల్ ఆర్ అన్నారు.60 గజాల స్థలాల్లో సొంతింటి కలను నెరవేర్చుకున్నారని ఆడపడుచుల కళ్లలో ఆనందం, ఆత్మగౌరవం తొణికిసలాడుతుందన్నారు.ఇప్పటికే దాదాపు 500 ఇళ్లకు పైగా గృహప్రవేశాలు చేయగా... మరో 3వేల ఇళ్లు చివరి దశ నిర్మాణంలో ఉన్నాయని లక్ష్మారెడ్డి అన్నారు.ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న ప్రతీ ఒక్కరికీ విడతల వారీగా రూ.5లక్షలు అందజేస్తుందన్నారు.ఏదైనా టెక్నికల్ ప్రాబ్లమ్ తో ఆలస్యమైన ఆందోళన పడొద్దని కిచ్చెన్న సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండో విడతలో ఇల్లు లేని ప్రతీ నిరుపేద, మధ్యతరగతి ఆడపడుచులందరికీ సొంతింటి కలను నెరవేర్చుతామని కె ఎల్ ఆర్ అన్నారు.

గత బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్స్ నిర్మించి కనీసం ఒక్కరికైనా ఇవ్వలేదన్నారు. శిథిలావస్థకు చేరే దుస్థితి నాటి ప్రభుత్వంలో ఉందన్నారు. మహేశ్వరం, కందుకూరు సహా నియోజకవర్గంలో అనేక గృహ ప్రవేశాల్లో లబ్ధిదారులతో కలిసి లక్ష్మారెడ్డి కిచ్చెన్న పాల్గొన్నారు.

## తారకళాశాలలో దోస్తు ద్వారా...
## డిగ్రీలో ప్రవేశాలకు ఈనెల 15 వరకు చివరి అవకాశం.
### - ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ.



సంగారెడ్డి ప్రతినిధి జూన్ 04 ( ప్రజా కలం): తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో దోస్త్ ద్వారా డిగ్రీ లోని వివిధ కోర్సులలో అడ్మిషన్లు పొందుటకు దోస్తు మూడవ దశ అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఇది చివరి అవకాశం అని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపినారు. తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో డిగ్రీలో అడ్మిషన్లకై దోస్త్ ద్వారా రెండవ దశలో సీట్లు వచ్చినవారు తమ సీటును రిజర్వేషన్ చేసుకొనుటకు ఆన్లైన్ సెంటర్ల ద్వారా గాని, మీసేవ ద్వారా గాని రేపటి లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని, లేనిచో వారి సీటు రద్దవుతుందని తెలిపినారు. తారా కళాశాల తెలంగాణలోని ఉన్నతమైన వది కళాశాలలో ఒకటని, ఈ కళాశాలలో బి.ఏ; బి.ఎస్సి. లైఫ్ సైన్సెస్; బి.ఎస్సి. ఫిజికల్ సైన్సెస్; బి.సి.ఏ.; బి.బి.ఏ.; బీ.కాం, కంప్యూటర్స్ వంటి కోర్సులతోపాటు ఉపాధిని కల్పించే బీకాం (బి.ఎఫ్.ఎస్.ఐ); బీ.కాం. (హెచ్.ఆర్); బి.బి.ఏ. (రిటైలింగ్) మరియు బి.ఫార్మసీ. కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఈ కోర్సులను బోధించడానికి అత్యధిక అనుభవము కలిగిన అధ్యాపక బృందం అందుబాటులో ఉందని తెలిపినారు. ఈ కళాశాలలో అడ్మిషన్ పొందిన వారికి ఎన్సిసి, ఎన్. ఎస్.ఎస్., క్రీడల వంటి సదుపాయాల తో పాటు విద్యార్థులు రాష్ట్ర ,జాతీయ స్థాయి శిబిరాలలో పాల్గొనుటకు అవకాశం ఉందని తెలిపినారు. కళాశాలలో సైన్స్ విద్యార్థులకు ఆధునిక సదుపాయాలు కలిగిన లాబరేటరీ సదుపాయాలు ఉన్నాయని, కంప్యూటర్ విద్యార్థులకు పూర్తి సదుపాయాలతో కంప్యూటర్ ల్యాబ్లు ఉన్నాయని, విద్యార్థులకు జిమ్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. వీటన్నింటితో పాటు అన్ని కోర్సులకు సంబంధించిన పుస్తకాలు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో అతిపెద్ద లైబ్రరీ సదుపాయం బాటులో ఉందని, వీటన్నింటితో పాటు ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్షిప్ సదుపాయం ఉందని, మరియు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రభుత్వ పాఠశాల, మరియు కళాశాలలో చదివిన అమ్మాయిలకు అజిత్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సంవత్సరానికి 30 వేల స్కాలర్షిప్ సదుపాయాన్ని అందిస్తున్నదని, అదే విధంగా అమ్మాయిలకు సంవత్సరానికి ?10,000 వరకు మలబార్ గోల్డ్ స్కాలర్షిప్ సదుపాయం అందుబాటులో ఉందని తెలిపినారు.కావున దోస్తు ద్వారా మూడవ దశ అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 15వ తారీకు వరకు ఉందని, డిగ్రీ చదివే విద్యార్థులు తారా కళాశాలకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చి అడ్మిషన్ పొందాలని తెలిపినారు. దోస్తు ద్వారా డిగ్రీలో అడ్మిషన్ పొందడానికి ఇదే చివరి అవకాశం అని, విద్యార్థులు దీనిని గమనించి తారా కళాశాలలో మూడవ దశ అడ్మిషన్లలో మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపినారు.తారా కళాశాల సంగారెడ్డి జిల్లాలోని ఐడి కళాశాలని, ఈ కళాశాలకు జాతీయస్థాయి న్యాప్ ఏ ప్లస్ గ్రేడ్ లభించిందని, అత్యున్నతమైన విలువలు కలిగిన, అనుభవము కలిగిన అధ్యాపక బృందం కలిగినటువంటి ఈ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్ పొందాలని తెలిపినారు. దోస్తు ద్వారా మూడవ దశ అడ్మిషన్లు ఈనెల 15వ తేదీ చివరి అవకాశం అని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే అభ్యర్థులు నేరుగా కళాశాలను సందర్శించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు.

## కంకోల్ పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన...
## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి.
### - ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

సంగారెడ్డి, ప్రతినిధి జూన్ 4: (ప్రజా కలం ): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి సూచించారు. గురువారం నాడు మునిపల్లి మరియు కంకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది విధులకు సమయానికి హాజరవుతున్నారా లేదా అనే అంశాన్ని అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ విభాగాలను సందర్శించి పరిశీలించారు. ఆయా ఆరోగ్య కేంద్రాలను అందుబాటులో ఉన్న మందుల



నిల్వలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో, గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ) మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచరాదని ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా, సకాలంలో అందించాలని, వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు సిబ్బంది సమయం పాలనపాటించాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆమె పేర్కొన్నారు. మధ్యాహ్నం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో వైద్య అధికారుల మీటింగ్ లో ప్రజలకు అందిస్తున్న కార్యక్రమాలను గురించి రివ్యూ చేశారు. అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించి వైద్య ఆరోగ్య శాఖకు మంచి పేరు తేవాలని కోరారు.

## సంగారెడ్డి నూతన డీఈఓ ను కలిసిన బీఆర్ఎస్వీ నాయకులు అఖిల్.

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 4 (ప్రజా కలం):

సంగారెడ్డి జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారి గా బాధ్యతలు స్వీకరించిన డిఈఓ రోహిణి ని గురువారం నాడు బిఆర్ఎస్వీ నాయకులు అఖిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యా రంగ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అఖిల్ కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బత్తుల విక్రమ్, సాయి, పాల్గొన్నారు.



## ఎస్టీ నిరుద్యోగ యువతకు జూన్ 6న నైపుణ్యాభివృద్ధి అవగాహన, ప్రేరణ శిబిరం
### జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి బి. వెంకటేష్.

సంగారెడ్డి, ప్రతినిధి జూన్ 4:( ప్రజా కలం): జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఒకరోజు నైపుణ్యాభివృద్ధి అవగాహన ప్రేరణ శిబిరాన్ని ఈ నెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు సంగారెడ్డి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి బి. వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 114 మంది ఎస్టీ నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్న ఈ శిబిరం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వివిధ నైపుణ్యాభివృద్ధి శిక్షణ



కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాలను పరిచయం చేయడం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ నైపుణ్య శిక్షణ సంస్థల ప్రతినిధులు, మోటివేషనల్ కౌన్సిలర్లు పాల్గొని యువతకు కెరీర్ మార్గనిర్దేశం చేయనున్నారని,అలాగే శిక్షణ అనంతరం లభించే ఉపాధి అవకాశాలు, ప్లేస్‌మెంట్ అవకాశాలు, స్వయం ఉపాధి మార్గాలపై సమగ్ర సమాచారం అందించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, అగ్రికల్చర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, బ్యూటీ అండ్ వెల్నెస్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ స్కిల్ కౌన్సిల్, ఎన్ఐ-ఎంఎస్ఎంఈ శిక్షణ సంస్థలు పాల్గొని తమ శిక్షణ కార్యక్రమాలను యువతకు వివరించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని అర్హత కలిగిన ఎస్టీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని శిబిరంలో పాల్గొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆయన కోరారు.

## హత్నూర పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.

### -స్టేషన్ ఆవరణ, రికార్డులు, సిబ్బంది బ్యారెక్స్ పరిశీలన.
### -ప్రతి రికార్డును ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలి, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి.
### - సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
### -పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి -- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.


సంగారెడ్డి ప్రతినిధి జూన్ 4 (ప్రజా కలం): హత్నూర పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాలు, సిబ్బంది బ్యారెక్స్ పరిశుభ్రతను పరిశీలించారు. మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించగలమని, అందుకు సిబ్బంది ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక (ప్లాన్ ఆఫ్ యాక్షన్) ఉండాలని అన్నారు.

తరచూ వాహనాల తనిఖీలు, నాకాబందీ వంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి అనుమానిత వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచాలని సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తుల వివరాలు ప్రతి సిబ్బందికి తెలుసుకొని ఉండాలని, పగలు-రాత్రి బీట్‌లలో క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ ఆన్‌లైన్ రికార్డుల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. మన చుట్టూ జరుగుతున్న వివిధ రకాల నేరాలు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్‌హెచ్‌ఓ కు సూచించారు.

సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని, తమకు కేటాయించిన విధులను పూర్తి భాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓపికగా విని సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని



అన్నారు.

పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం ఎంతో ముఖ్యమని, ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో గానీ, వ్యక్తిగతంగా గానీ ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత అధికారుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఈ తనిఖీలో హత్నూర ఎస్‌హెచ్‌వో శ్రీధర్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మర్పడగలో సహస్ర బ్రాహ్మణ సువాసిన్యర్చన రజతోత్సవం.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 04.

కొండపాక మండలంలోని మర్పడగ గ్రామంలో గల శ్రీ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో నిర్వహించిన సహస్ర బ్రాహ్మణ సువాసిన్యర్చన (రజతోత్సవం) మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి, శ్రీశ్రీశ్రీ వెదురుపాక గారు, చెప్యాల హరినాథ శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, గానా-భజనలతో కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 1,200 మంది మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామిగళ్ చరవాణి ద్వారా వీక్షించి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు, భక్తులకు దివ్యాశీస్సులు అందజేశారు. కార్యక్రమం పండుగ వాతావరణంలో భక్తిశ్రద్ధలతో సాగింది.

# హరీష్ బర్త్‌డే..మహిపాల్‌రెడ్డి అభినందనల వెల్లువ..

పటాన్‌చెరు జూన్ 4 (ప్రజా కలం) ప్రతినిధి

తెలంగాణ రాజకీయాల్లో ప్రజానాయకుడిగా విశేష గుర్తింపు పొందిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ ఉప ఫ్లోర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు జన్మదిన సందర్భంగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హృదయపూర్వక



శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని హరీష్‌రావు నివాసానికి వెళ్లిన మహిపాల్‌రెడ్డి, ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్ల అంకితభావంతో పనిచేస్తున్న హరీష్‌రావు సంపూర్ణ ఆరోగ్యంతో దీర్ఘాయుష్షుతో ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో హరీష్‌రావు చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రజలతో మమేకమై పనిచేసే నాయకుడిగా ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల పాండురంగారెడ్డి, నరసింహ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ జీవితంలో మరిన్ని విజయాలు సాధించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు..

# ప్రజా సమస్యలపై జోనల్ కమిషనర్ చంద్రకళ కు వినతి పత్రం అందజేసిన బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి


మహేశ్వరం, జూన్ 04,(ప్రజా కలం)

ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జోనల్ కమిషనర్ చంద్రకళ కు బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు.

గ్రేటర్ హైదరాబాద్ లోని బడంగుపేట సర్కిల్ పరిధిలోని 60 వ డివిజన్ లో దాతునగర్, సాయి గణేష్ నగర్, సుభాష్ చంద్రబోస్ కాలనీ, సాయి కృప కాలనీ, జయభారత్ నగర్ ఆఫీసర్స్ కాలనీ లలోని గుంతలు గుంతలు గా మారిన రోడ్లు మరమ్మతులు చేయాలని, పార్క్ ఏరియా లో పండగల ఉత్సవాల కొరకు షెడ్ నిర్మాణం చేపట్టాలని , వీధి దీపాలు ఏర్పాటు, దోమల నివారణకు ఫాగ్ చేయాలని, తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన వినతి పత్రాన్ని శంసాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ కి అందించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సత్యప్రకాష్ జీ, గంగవరం సురేష్, జై కాంత్ గుప్తా, దినేష్ , తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ షిరిడి సాయిబాబాపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి






వలిగొండ జూన్ 04 ప్రజాకలం:శ్రీ షిరిడి సాయిబాబాపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనీ,యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ ఆవరణలో గురువారం రోజు శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో శిరిడి సాయిబాబాపై దుష్ప్రచారం చేస్తున్న లలిత్ కుమార్, కరుణాకర్,సగ్గున దువ్వాడ శివప్రసాద్,కిల్లి భాస్కర్,సామవేదం షణ్ముఖ శర్మ లు శ్రీ షిరిడి సాయిబాబా కు వేదానికి సంబంధం లేదని అసలు సాయి బాబా ఆరాధన నిర్మాణానికి వ్యతిరేకమని మరియు బాబా ఒక ముస్లిం అని అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఈ విధంగా సాయిబాబా భక్తుల భావాలను దెబ్బతీసే విధంగా ప్రచారం చేస్తున్నారని దీనికి షిరిడి సాయిబాబా భక్తులుగా నిరసన తెలుపుతున్నమని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోషల్ మీడియాలో శిరిడి సాయిబాబా పై విస్పుర్చరాలు చేస్తున్న లలిత్ కుమార్ కరుణాకర్ సగ్గున దువ్వాడ శివప్రసాద్ కిల్లి భాస్కర్ సామవేదం షణ్ముఖ శర్మ వీరి వెంట ఉన్న విధురశేఖర భారతి ల దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. అనంతరం శ్రీ షిరిడి సాయిబాబా భక్తులు వారు చేస్తున్న వాక్యాలను ఖండించాలని,శ్రీ షిరిడి సాయిబాబా భక్తులను కోరారు. అనంతరం సాయిబాబా దేవాలయంలో కీర్తిశేషులు గుజ్జెల నారాయణ పెద్ద కుమారుడు గజ్జెల వీరేశం వసంతల,కుమారులు గజ్జెల అమరేందర్ సంతోషిణి,గజ్జెల సతీష్ ప్రతిభ,ల ఆధ్వర్యంలో శ్రీ షిరిడి సాయి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గౌరీశెట్టి అశోక్,రమేష్, బాలాజీ,గజ్జెల అమరేందర్ గజ్జెల సతీష్,అప్పిశెట్టి సంతోష్,రేగూరి అమరేందర్,పోకల రమేష్, కంకల కిష్టయ్య,బోడ కుమార్ సాయి,బోళ్ల లలిత శ్రీనివాస్, దంతూరి సత్తయ్య,సీలోజు శ్రీరాములు,బుంగమట్ల కిష్టయ్య,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడుస్తున్న బిఆర్ఎస్ నాయకుడు రామిడి రామిరెడ్డి

# చిల్లర రాజకీయాలు మానుకోవాలి

### ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, జూన్ 04,(ప్రజా కలం)

అరవింద్ నగర్ కాలనీలో స్థానికులు తమ సొంత పైసలతో రోడ్డు పనులు చేసుకుంటుంటే అక్కడికి వచ్చి వీడియోలకు ఫోజులిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడుస్తున్న బిఆర్ఎస్ నాయకుడు రామిడి రామిరెడ్డి చిల్లర రాజకీయాలపై ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. ఆనాడు జేసీబీ పంపి ఉంటే ఈ దుస్థితి వచ్చేదా? కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఒక జేసీబీ కూడా పంపలేదు" అని పెద్ద పెద్ద మాటలు మాట్లాడు తున్నావు. మరి మీ బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏమైంది రామిరెడ్డి? ఆనాడు మీ హయాంలో కనీసం ఒక జేసీబీ పంపి ఈ రోడ్లను బాగు చేసి ఉంటే, ఈరోజు కాలనీ ప్రజలకు తమ సొంత పైసలతో పనులు చేసుకునే ఈ దుస్థితి వచ్చేది కాదు కదా! కాలనీ వాసుల నేటి కష్టానికి కారణమే మీ పదేళ్ల నిర్లక్ష్యం. ఆ పాపం మీది కాదా? పదేళ్ల అధికారంలో ఏ రోజైనా పట్టించుకున్నావా? గడిచిన 10 సంవత్సరాలుగా రాష్ట్రంలో మీ ప్రభుత్వమే ఉంది, స్థానికంగా మీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గారే ఉన్నారు. ఆ 10 ఏళ్లలో అరవింద్ నగర్ కాలనీ వాసుల కష్టాలు నీకు కంటికి కనిపించలేదా? పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క రోడ్డు వేయలేని చేతగానితనం మీది!

మీ పదేళ్ల పాపాల అప్పులను కాంగ్రెస్ కడుగుతోంది

రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల్లో ముంచి, ఖజానాను పూర్తిగా గుల్ల చేసి పోయింది మీ బిఆర్ఎస్ ప్రభుత్వం. మీరు చేసిన ఆ అప్పులను, వైఫల్యాలను ఒక్కొక్కటిగా సర్దుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోంది. “కాంగ్రెస్ 2 ఏళ్లలో ఏం చేసింది?” అని అడిగే హక్కు నీకు లేదు అని రాఘవేందర్ రెడ్డి అన్నారు. పగటి కలలు ఆపండి పబ్లిసిటీ చాలించండి అని రాబోయేది మా ప్రభుత్వమే అంటూ పగటి కలలు కనడం ఆపండి. ప్రజలు మిమ్మల్ని శాశ్వతంగా పక్కన పెట్టారు. కాలనీ వాసులు తమ సొంత డబ్బులతో, కష్టంతో రోడ్లు వేసుకుంటుంటే జిహెచ్ఎంసి ఎన్నికలు వస్తున్నాయని క్రెడిట్ కొట్టేయడానికి సిగ్గులేకుండా పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారు. నీకు నిజంగా చిత్త శుద్ధి ఉంటే గత 10 ఏళ్ల మీ బిఆర్ఎస్ పాలనలో ఈ 57వ డివిజన్‌కు మీరు చేసిన ఒక్క శాశ్వత అభివృద్ధి పనిని చూపించాలని సవాల్ విసిరారు.

# జల సంరక్షణే మన సంరక్షణ హరితహారం నందు విషయాలపై ప్రత్యేక గ్రామ సభలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ సర్వ శ్రీ కిరణ్మయి

మహేశ్వరం, జూన్ 04,(ప్రజా కలం)

తెలంగాణ ప్రభుత్వం ద్వారా ప్రతిష్టాత్మముగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళి కార్యక్రమములో భాగంగా సాలిడ్ వెస్ట్ మ్యానేజ్మెంట్, వర్షాకాల సన్నదత, త్రాగునీరు, జల సంరక్షణే మన సంరక్షణ హరితహారం నందు విషయాలపై ప్రత్యేక గ్రామ సభ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సభకు ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. గ్రామ సభ యందు గ్రామ సర్పంచ్ మునగ పాటి నవీన్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు గ్రామంలోని ఏ విదంగా పరిశుభ్రముగా ఉంచుకోవలో తెలియజేస్తూ తమ ఇండ్ల నుండి వెలువడే చెత్తను 4 రకాలుగా విభజించబడిన ఆకు పచ్చ రంగు చెత్త బుట్టలో – తడి చెత్తను, నీలం రంగు చెత్త బుట్టలో – పొడి చెత్తను, నారింజ రంగు బుట్టలో శానిటరీ చెత్తను మరియు నలుపు రంగు చెత్త బుట్టలో – ప్రత్యేక హానికర చెత్తను వేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ కు అందించవలేనని కోరినారు.

అధెవిధముగా గ్రామంలో చెత్త సేకరణకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ఒకటే ఉన్నందున గ్రామం మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో చెత్త సేకరణకు ఇబ్బందులు కలుగుతుందని అదనపు వాహనాలు ప్రభుత్వం ద్వారా సమకూర్చాలని గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) గారిని కోరగా అదనపు కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వం ద్వారా వాహనాలు మంజూరీ చేయుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ మండల ప్రత్యేక అధికారి సుభాషిణి , ఏసీపీ మహేశ్వరం జానకి రెడ్డి , ఎంపీడీఓ మహేశ్వరం శారదమ్మ, ఎమ్మార్వో మహేశ్వరం చిన్న అప్పల నాయుడు గారు, ఎంపీఓ మహేశ్వరం రవీందర్ రెడ్డి, సి ఐ మహేశ్వరం రాఘవేందర్ రెడ్డి, సీడీపీఓ మహేశ్వరం శాంత శ్రీ, గ్రామ ఉప సర్పంచ్ జొరల రమేశ్ , వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టామ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమొని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరిబాబు, సున్నం స్వప్నా, జటావత్ రుకేష్, రెవెళ్ళ చంద్రమౌళి, నాయకులు అల్లే కుమార్, వత్తుల రఘుపతి, వనంపల్లి శ్రావణ్, బంగారిగల్ల లాజర్, స్వర్ణగంటి సుభాష్, అల్లే భిక్షపతి, కటికల శ్రీహరి, షైక్ హాజిబాబా, పెద్దలు మిద్దింటి సురేశ్, మిద్దింటి యాదగిరి, దుడ్డు కృష్ణ యాదవ్, కాకి నాగేష్, సున్నం కృష్ణ, ఆవులకాడి శ్రీశైలం, ఆవులకాడి మహేష్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్స్ గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శి సుజాత గార్లు పాల్గొన్నారు.






# మత్స్య సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక

వలిగొండ జూన్ 4 ప్రజాకలం:మండల పరిధిలోని వెలువర్తి గ్రామ మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గం ఎన్నికలు గురువారం ఎన్నికల అధికారి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల్లో సంఘం డైరెక్టర్లుగా దుడ్డు అండాలు,చెవ్వ ఎల్లమ్మ, దుడ్డు ఆంజనేయులు, మారబోయిన అంజయ్య, సూరబోయిన దయాకర్, నిమ్మల శేఖర్,మారబోయిన పరుశురాం,బత్తెపు శేఖర్, బోల్లబోయిన శేఖర్ లు ఎన్నికయ్యారు. అనంతరం గెలుపొందిన సభ్యులు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు మహాసభ గ్రామశాఖ అధ్యక్షుడు గుర్రాల రాములు, భత్తెపు రంగనాథ్, మారబోయిన మత్స్యగిరి, చెవ్వ రాజు ముదిరాజ్, బత్తెపు శ్రీను,తదితరులు పాల్గొన్నారుఖ

# బాధితుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

వలిగొండ జూన్ 4 ప్రజాకలం:మండలంలోని పులిగిల్ల గ్రామంలో అనారోగ్య కారణాలతో బండారి పెంటమ్మ మృతిచెందగా, ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నక్కల



మాధవరెడ్డి 10000 రూపాయలను,కోమటిరెడ్డి ఇంద్రారెడ్డి ఐదువేల రూపాయలను,మాజీ సర్పంచ్ జక్కా వెంకట్ రెడ్డి 5000 రూపాయలను బుగ్గ మనోజ్ కుమార్ 5000 రూపాయలను,అందజేశారు. అలాగే,అదే గ్రామంలో ప్రమాదానికి గురైన పల్లెర్ల యాదయ్యకు పదివేల రూపాయలను,దొడ్డి దాసుకి 5వేల రూపాయలను నక్కల మాధవరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేముల అనూష మల్లేష్, ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వెంకటేశం, వాకిటి సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జక్క దామోదర్ రెడ్డి, వార్డు మెంబర్లు పర్వతం సంతోష , సిలువేరు మహేష్, వేముల పుష్ప, బుగ్గ మల్లయ్య బందారపు నరేష్ పల్లెర్ల బిక్షపతి,పల్లెర్ల కిషన్ పల్లర్ల మల్లేష్,బండారు చింటూ,బండారు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీని చాటుకున్న యువకులు

### -దొరికిన ఫోన్ ను పోలీసులకు అప్పగించిన యువకులు




వలిగొండ జూన్ 4 ప్రజాకలం:రోడ్డుపై దొరికిన ఖరీదైన మొబైల్ ఫోన్ ను పోలీసులకు అప్పగించి ఇద్దరు యువకులు తమ నిజాయితీని చాటుకున్నారు. మండల పరిధిలోని టేకులసోమారం గ్రామానికి చెందిన నరగొని మురళి, చేగూరి వంశీరాజ్ బుధవారం రాత్రి భువనగిరిలో వేడుకకు వెళ్లి వస్తుండగా,నాగిరెడ్డిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డు పై ఫోన్ దొరికింది. గురువారం ఆ ఫోన్ ను వలిగొండ పోలీసులకు అందజేశారు. యువకుల నిజాయితీని అభినందించిన పోలీసులు, ఫోన్ ను బాధితుడికి అందజేస్తామన్నారు.

# పోలీసుల చొరవతో మిల్లులో ధాన్యం అన్‌లోడ్ వేగవంతం.. రైతుల హర్షం.

సిద్దిపేట జిల్లా ప్రజాకలం జూన్ 04.


గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, తోగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్ కుమార్ అహ్మద్‌నగర్‌లోని రైస్ మిల్లును సందర్శించారు. అక్కడ ధాన్యం అన్‌లోడ్ చేసేందుకు తగినంత మంది కార్మికులు లేకపోవడంతో కేవలం 20 మంది మాత్రమే పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా మిల్లు యజమానులకు మరిన్ని కార్మికులను వెంటనే ఏర్పాటు చేసి ధాన్యం అన్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పోలీసుల సూచనలకు సానుకూలంగా స్పందించిన మిల్లు యాజమాన్యం అదనపు కార్మికులను పిలిపించి అన్‌లోడ్ పనులను వేగవంతం చేసింది. దీంతో ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా సాగుతుండటంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.



# నిలువ నీడలేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు ఇవ్వాలి

## :పిఆర్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)నిలువ నీడలేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని పిఆర్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి అధికారులను డిమాండ్ చేశారు.గ్రేటర్ హైదరాబాద్ లోని కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పరిధి చింతల్, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ మొదలగు మున్సిపాలిటీ లలోని వివిధ కాలనీల్లో నిలువ నీడలేని నిరుపేదలు గత పది సంవత్సరాలుగా తమ పేర్లను నమోదు చేసుకుంటూ, డబుల్ బెడ్ రూమ్ ల కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. అట్టి పేదలు డబుల్ బెడ్ రూమ్ కు అర్హులుగా ఉన్న లెవర్ 2 నుండి అనర్హులుగా మారుస్తూ లెవర్ 3 లోకి పంపించడం జరిగింది. దీంతో ఆక్రోశించిన నిరుపేదలు మున్సిపాలిటీలు, తహసిల్దార్ ఆఫీసులను ముంచేత్తుతున్న పరిస్థితి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం రీ - సర్వే నిర్వహించి లెవర్ 3 ని రద్దుచేసి, లెవర్ 2 అభ్యర్థులందరికీ డబుల్ బెడ్ రూమ్ లను పంపిణీ చేయాలని" ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి డిమాండ్ చేశారు. గురువారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పై విధంగా అన్నారు. కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ లకిత్ కుమార్ ఐ.ఏ.ఎస్.కి వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మంగాపురం సురేష్, కిలాదుల యాదయ్య, ఉప్పతల దేవి, షేక్ రిజ్వానా బేగం, షేక్ రఫీక్, మహమ్మద్ టైసిమ్ ఉన్నేసా, షేక్ నజీమా బేగం, షేక్ మల్లన్, మహమ్మద్ రజియా బేగం, షేక్ రేష్మ, నందిపాటి ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



# సుచిత్రలో ఘనంగా "స్ప్రింట్ డయాగ్నస్టిక్స్" మొదటి వార్షికోత్సవ కార్యక్రమం

## - ముఖ్య అతిధిగా హాజరైన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 132 - జీడిమెట్ల డివిజన్ సుచిత్రలోని స్ప్రింట్ డయాగ్నస్టిక్స్ మొదటి వార్షికోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.




ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... వైద్యరంగంలో రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతిక మార్పులతో "రోగ నిర్ధారణ, రోగానికి చికిత్సలో బయో ఫైర్ అనే నూతన టెక్నాలజీతో అత్యుత్తమ సేవలను అందించడం ప్రజల పట్ల వారికి ఉన్న సేవా దృక్పదాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రజా సేవలో అద్భుత టెక్నాలజీతో ముందుకు సాగుతున్న "స్ప్రింట్ డయాగ్నొస్టిక్స్" మరింత అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన వెల్నెస్ ఫ్యామిలీ కార్డ్ ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో స్ప్రింట్ డయాగ్నొస్టిక్ ఎండి డాక్టర్ భరత్ రెడ్డి, స్ప్రింట్ డయాగ్నొస్టిక్ సీవోవో తరుణ్ ఆదిత్య, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ కార్తీక్, ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఆటో బలరాం, నదీమ్ రాయ్, చంద్రశేఖర్ రెడ్డి, కాలే గణేష్, బాల మల్లేష్, మహిళా నాయకురాలు ఇందిరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఫ్రాంక్లిన్ ఇండియా డివిడెండ్ యీల్డ్ ఫండ్ 20 ఏళ్ల ఘనత

## - పెట్టుబడిదారుల నమ్మకంతో 2,300 కోట్ల నిర్వహణలోని మొత్తం ఆస్తుల (AUM) మైలురాయి

## దీర్ఘకాలిక డివిడెండ్ యీల్డ్ వ్యూహం మార్కెట్ సైకిల్స్ అంతటా స్థిరమైన సంపద సృష్టిని అందిస్తుంది

**ముంబై, జూన్ 04, (ప్రజాకలం) :** ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మ్యూచువల్ ఫండ్ నిర్వహిస్తున్న ఫ్రాంక్లిన్ ఇండియా డివిడెండ్ యీల్డ్ (ఇదివరకు టెంపుల్టన్ ఇండియా ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్ అని పిలువబడేది) పెట్టుబడిదారులకు సంపద సృష్టిస్తూ 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా, ఈ ఫండ్ యొక్క నిర్వహణలోని మొత్తం ఆస్తులు 2,300 కోట్ల మార్క్‌ను దాటి మరో కీలక మైలురాయిని కూడా సాధించింది.

డివిడెండ్ యీల్డ్-ఆధారిత ఈక్విటీ పెట్టుబడి వ్యూహాన్ని అనుసరించే ఈ ఫండ్, దీర్ఘకాలంలో అనేక కాలపరిమితుల్లో బెంచ్‌మార్క్‌ను మించిపోయిన పనితీరును చూపించింది. ప్రత్యేకంగా, గత 15 సంవత్సరాలు అలాగే ప్రారంభం నుంచి ఇప్పటివరకు, నిఫ్టీ డివిడెండ్ ఆపర్చునిటీస్ 50 ఇండెక్స్‌తో పోలిస్తే మెరుగైన రాబడులను నమోదు చేసింది.

ఈ ఫండ్ ప్రధానంగా అధిక డివిడెండ్ యీల్డ్ కలిగిన కంపెనీలలో పెట్టుబడి పెడుతూ, మార్కెట్ సైకిల్స్ అంతటా మెరుగైన రిస్క్-అడ్జస్టెడ్ రిటర్న్స్‌ను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ స్కీమ్ ప్రారంభ సమయంలో పెట్టిన 1 లక్ష పెట్టుబడి, 2026 ఏప్రిల్ 30 నాటికి దాదాపు 13 రెట్లు పెరిగి సుమారు 13.60 లక్షలుగా మారింది. ఇది 13.97% కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్ (సిఎజిఆర్)ను సూచిస్తుంది. తులనగా, అదే పెట్టుబడి నిఫ్టీ 500 ఇండెక్స్ (టి.ఆర్.ఐ. ఆధారంగా) పెట్టుబడిగా ఉంటే, అది సుమారు ?10.3 లక్షలకు పెరిగి 12.39% జూా+=ను నమోదు చేసేది. ఈ స్కీమ్ సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌ల (సిప్) ద్వారా క్రమశిక్షణతో పెట్టుబడి చేయడం వల్ల దీర్ఘకాల ప్రయోజనాలను కూడా చూపించింది. ప్రారంభం నుంచే నెలకు ?10,000 సిప్ గా పెట్టుబడి పెడితే, 2026 ఏప్రిల్ చివరి నాటికి అది ?1.2 కోట్లకు పైగా పెరిగింది.

ఫండ్ 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఫ్రాంక్లిన్ ఇండియా డివిడెండ్ యీల్డ్ యొక్క పోర్ట్‌ఫోలియో మేనేజర్ రాజసా కాకులవరపు ఇలా అన్నారు: "ఈ ఫండ్ వివిధ మార్కెట్ సైకిల్స్‌లో డౌన్‌సైడ్ ప్రొటెక్షన్‌తో పాటు స్థిరమైన కాంపౌండింగ్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం నిరంతరంగా మరియు పెరుగుతూ ఉన్న డివిడెండ్ చెల్లింపు చరిత్ర కలిగిన కంపెనీలను ఎంపిక చేస్తాం. ఇవి సాధారణంగా ఆకర్షణీయంగా కాని తక్కువ విలువల్లో ట్రేడ్ అవుతుంటాయి, తద్వారా రీ-రేటింగ్ అవకాశాలు కూడా ఏర్పడతాయి." ఈ పెట్టుబడి వ్యూహం క్రింది అంశాల సమ్మిళితంగా ఉంటుంది: డివిడెండ్ యీల్డ్‌పై ఆధారపడిన స్టాక్ ఎంపిక, రంగాలు మరియు మార్కెట్ క్యాపిటలైజేషన్లలో విభిన్నీకరణ, అంతర్జాతీయ ఈక్విటీలకు ఎంపిక చేసిన ఎక్స్‌పోజర్, మరియు పునరావృత ఆదాయం కోసం అవకాశాలను బట్టి రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఆర్.ఇ.ఐ.టి.లు)లో అవకాశవాద కేటాయింపు.

ఈ ఫండ్ 50 కంటే తక్కువ స్టాక్స్‌తో విభిన్నమైన డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోను నిర్వహిస్తుంది. ఇది వివిధ రంగాలలో విస్తరించి ఉంది, వాటిలో ముఖ్యంగా: బ్యాంకింగ్ మరియు ఫైనాన్షియల్ సర్వీసెస్, పవర్ మరియు ఎనర్జీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎఫ్.ఎం.సి.జి., ఏరోస్పేస్ మరియు డిఫెన్స్, ఆటోమొబైల్స్, టెలికాం, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ మరియు గ్యాస్.

అంతర్జాతీయ వైవిధ్యం పోర్ట్‌ఫోలియో స్థిరత్వాన్ని పెంచుతుంది

ఈ ఫండ్ తన పోర్ట్‌ఫోలియోలోని ఒక భాగాన్ని అంతర్జాతీయ ఈక్విటీలకు కేటాయించడం ద్వారా వివిధ భౌగోళిక ప్రాంతాలు, పెట్టుబడి ఆలోచనలు మరియు విలువ అవకాశాల మధ్య విస్తృత వైవిధ్యాన్ని అందిస్తుంది. విదేశీ పెట్టుబడుల కోసం, ఈ ఫండ్ ప్రపంచవ్యాప్తంగా విలువ ఆధారిత పెట్టుబడి విధానానికి ప్రసిద్ధి చెందిన ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ యొక్క గ్లోబల్ రీసెర్చ్ సామర్థ్యాలను ఉపయోగిస్తుంది. ఏప్రిల్ 2026 నాటికి, ఈ ఫండ్ సుమారు 8% ఎక్స్‌పోజర్‌ను అంతర్జాతీయ ఈక్విటీలలో కలిగి ఉంది. ఇందులో ప్రధానంగా యునైటెడ్ స్టేట్స్, దక్షిణ కొరియా మరియు తైవాన్ వంటి మార్కెట్లు ఉన్నాయి.


మార్కెట్ క్యాపిటలైజేషన్లలో డైనమిక్ కేటాయింపు

ఈ ఫండ్ మార్కెట్ క్యాపిటలైజేషన్ల మధ్య తన ఎక్స్‌పోజర్‌ను డైనమిక్‌గా సర్దుబాటు చేస్తూ, లార్జ్-క్యాప్ బయాస్ ను బలంగా కొనసాగిస్తుంది. గత 12 నెలల్లో పోర్ట్‌ఫోలియో సగటు కేటాయింపులు ఇలా ఉన్నాయి: 54% పెద్ద-క్యాప్ స్టాక్స్‌లో, 11% మిడ్-క్యాప్ స్టాక్స్‌లో, 13% స్మాల్-క్యాప్ స్టాక్స్‌లో. అదనంగా, ఏప్రిల్ 2026 నాటికి ఈ ఫండ్ నాలుగు లిస్టెడ్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (ఆర్.ఇ.ఐ.టి.లు)లో 9% కంటే ఎక్కువ కేటాయింపును కలిగి ఉంది.

విస్తృత మార్కెట్లతో పోలిస్తే అధిక డివిడెండ్ యీల్డ్

గత 12 నెలల్లో ఈ పోర్ట్‌ఫోలియో సగటు 2.71% డివిడెండ్ యీల్డ్‌ను అందించింది. ఇది నిఫ్టీ 500 ఇండెక్స్ యొక్క 1.17% డివిడెండ్ యీల్డ్‌తో పోలిస్తే గణనీయంగా ఎక్కువ. భారతదేశంలో డివిడెండ్ ఇన్వెస్టింగ్ థీమ్ రోజురోజుకీ మరింత బలపడుతోంది. దీర్ఘకాలిక క్యాపిటల్ అప్రిషియేషన్‌తో పాటు పోర్ట్‌ఫోలియో స్థిరత్వం మరియు రెగ్యులర్ ఆదాయ అవకాశాలను కోరుతున్న పెట్టుబడిదారుల సంఖ్య పెరుగుతోంది.

ఈ సందర్భంలో ఫ్రాంక్లిన్ ఇండియా డివిడెండ్ యీల్డ్ పెట్టుబడిదారులకు వివిధ రంగాలు, మార్కెట్ క్యాపిటలైజేషన్లు మరియు భౌగోళిక ప్రాంతాల్లో విస్తరించిన డివిడెండ్ చెల్లించే కంపెనీలకు ఎక్స్‌పోజర్‌ను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. దీర్ఘకాలికంగా వృద్ధి, ఆదాయ స్పష్టత మరియు పోర్ట్‌ఫోలియో వైవిధ్యాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు ఇది ఒక సమతుల్యమైన ఇన్వెస్ట్మెంట్ పరిష్కారంగా పరిగణించవచ్చు.



# కులవృత్తుల అభివృద్ధిలో నా సహాయసహకారాలు ఉంటాయి

## :ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ మండల్ స్వర్ణకార సంఘం నూతన కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యేకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదటి రోజు నుంచి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుల వృత్తుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వివిధ సంక్షేమ పథకాలతో కులవృత్తులపై ఆధారపడి ఉన్న వారికి చేయూతనిస్తూ ఆదుకోవడం జరిగిందన్నారు. కులవృత్తుల అభివృద్ధికి పాటుపడిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ క్రమంలోనే గత 12ఏళ్ల కాలంలో స్వర్ణ కారులతోపాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేశామని, రానున్న రోజుల్లో కూడా కులవృత్తుల అభివృద్ధిలో నా సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.

ఈకార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏవీ శేషాచారి, నూతన అధ్యక్షులు చొల్లేటి శ్రీనివాస్ చారి, ప్రధాన కార్యదర్శి ఎస్. నారాయణ చారి, కోశాధికారి శ్రీరామోజు మురళీధర్ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరామయ్య చారి, సలహాదారులు గుండవెల్లి నాగేశ్వర్ చారి, సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్ చారి, ఉప సంయుక్త కార్యదర్శి కృష్ణచారి, తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సమస్యలను పరిష్కరిద్దాం అభివృద్ధికి తోడ్పడుదాం

## జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

భూదాన్ పోచంపల్లి జూన్ 4 ( ప్రజా కలం )

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రాణాలికలో భాగంగా ప్రతి వార్డ్,గ్రామం అభివృద్ధి చెందుతే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని ప్రాణాలికతో ముందుకెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వం అని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి ఆధ్వర్యంలో 13 వార్డులలో అభివృద్ధి కోసం తోడ్పడతానని పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి సుందరీకరణ తీర్చిదిద్దాలని కొనియాడారు. మొదటి రోజు పోచంపల్లి పట్టణ రేవనపల్లి 3వ వార్డ్ కౌన్సిలర్ రావుల జంగయ్య ఆధ్వర్యంలో తమ వార్డ్ అభివృద్ధి కోసం ప్రజాపాలన ప్రాణాలిక నిర్వహించారు.వార్డ్ సభలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వార్డులోని సమస్యల గురించి చర్చించారు. ముఖ్యంగా పోచంపల్లి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల ప్రవర్తన,




రోగుల పట్ల సక్రమంగా లేదని వైద్య సిబ్బందిని పిలిపించి మందలించడం జరిగింది. అదే విధంగా రేవనపల్లిలో కరెంట్ సమస్యల గురించి చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ S.E. ఆదేశించారు. అలాగే వార్డు సభలో సభ్యులు తమ సమస్యల గురించి వివరించి, పరిష్కారం పొంది, సభను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం లో , సీనియర్ మేనేజర్ నిర్మల, సీనియర్ అసిస్టెంట్ రాజేష్ మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# బాలానగర్ ఇన్స్పెక్టర్ టీ. నరసింహారాజుకు ప్రతిష్టాత్మక తెలంగాణ పోలీస్ సేవ పతకం

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) బాలానగర్ ఇన్స్పెక్టర్ టీ. నరసింహారాజుకు ప్రతిష్టాత్మక తెలంగాణ పోలీస్ సేవ పతకం వరించిన సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ టీ. నరసింహరాజును బిజెపి నాయకులు రాష్ట్ర మున్సిపల్ సెల్ కొకన్వీనర్, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... సేవా భావంతో పనిచేసే అధికారులకు పథకాలు వస్తాయని అందుకు నిదర్శనం బాలనగర్ ఇన్స్పెక్టర్ నరసింహ రాజు అని కొనియాడారు.ఈకార్యక్రమంలో జిల్లా మోర్చా ఓబిసి ఉపాధ్యక్షులు లకోజి మురళీకృష్ణ, అధ్యక్షులు కోడికూడి భాస్కర్, అధ్యక్షులు డొక్కాడీ భాస్కర్, శంకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ విజయ గణపతి దేవాలయంలో నిర్వహించిన పూజా పాల్గొన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చింతల్ న్యూ వివేకానంద నగర్లో నూతనంగా నిర్మించిన శ్రీ విజయ గణపతి దేవాలయ మండల పూజ కార్యక్రమాల్లో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ముందుగా ఈ ఆలయాన్ని ఇంత గొప్పగా నిర్మించిన స్థానిక ఆలయ కమిటీ సభ్యులకు మరియు కాలనీవాసులకు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఆరోగ్యంగా ఉండాలని ఆ స్వామి వారిని ఆకాంక్షించారు.

అనంతరం ఆలయ కమిటీ సభ్యులు స్థానిక పూజారులు శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుచ్చిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు దాస్ గౌడ్, విశాల్, అనిల్ కుమార్, బుచ్చిరెడ్డి, క్రాంతి కుమార్ స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యపు ధోరణిలో అధికారులు....!

## ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్...!

### రాష్ట్ర అవతరణ దినోత్సవం అనంతరం కూడా మేల్కొని తాసిల్దార్...!



**రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, మే 5 (ప్రజాకలం):**

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లోని తాసిల్దార్ కార్యాలయంలో అధికారులు రాష్ట్ర అవతరణ దినోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు బేకార్ చేసినట్టు తేట తెల్లం అయింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారుస్తూ గతంలోనే జీవోలు జారీ చేశారు. జిల్లా సమీకృత అధికారుల భవనాల సముదాయంలో కూడా ప్రతిష్టాత్మకంగా భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ కార్యాల యాల్లో తెలంగాణ తల్లి నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమాలు సైతం అధికారికంగా జరిగాయి. అయినా అధికారులు ఇంకా మేల్కోలేరు అని అర్థమవుతుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తొలి సమయంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలను ఫోటోలనే ఉంచి కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు రెండు రోజుల క్రితం జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాత చిత్రపటాలని పెట్టి జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరంగా ఉందంటూ ప్రజలు నవ్వుకుంటున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ అధికారుల పనితీరును ఏ విధంగా కొనసాగిస్తున్నారు అంటూ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను ఆదేశాలను అమలు చేయడం ప్రభుత్వ అధికారుల ముఖ్య ఉద్దేశం, అయినా అధికారులు నిర్లక్ష్యపు ధోరణితో వ్యవహరించడం పై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకోవడంపై కావాల్సిన చర్యలు సైతం ఇలాగే నిర్లక్ష్యం దూరంలో సాగుతున్నాయని అందుకు నిదర్శనంగా ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు తెరపైకి వస్తున్నాయని ప్రజలు తెలుపుతున్నారు. మండల స్థాయి విధులు నిర్వహించే అధికారులు సైతం ఇలాంటి ప్రభుత్వ ఆదేశాలపై నిర్లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో దాదాపు పదిమంది అధికారులు ఉన్న ఏ ఒక్క అధికారి కూడా ఈ తప్పును గుర్తించకపోవడం అధికారుల తీర్పు అద్దం పడుతుందని కాంగ్రెస్ పార్టీ నేతలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎం వివి ప్రసాద్ రావు, సీనియర్ అసిస్టెంట్ జగన్, ఆర్.ఐ లు శ్రీనివాస్, రమేష్, జూనియర్ సహాయకులు నాగరాజు, సహెర, హేమంత్, వీ.ఆర్.ఏ లు భాస్కర్ మణికంఠ, వెంకటయ్య, హేమంత్, ఆపరేటర్ వెంకట్ తో తదితరులు పాల్గొన్నారు.

# నోటీసులు జారీ..చర్యలు గల్లంతు.!..

**-అక్రమ బట్టీల వెనుక అదృశ్య హస్తం ఎవరిది.?..**
**-నోటీసులు జారీ..చర్యలు జీరో.!..**
**-కోట్ల వ్యాపారంపై అధికారుల మౌనం ఎందుకు.?..**
**-ప్రభుత్వ ఆదాయానికి గండి.. లాభాలు ఎవరి ఖాతాలోకి.?..**
**-15 రోజులు గడిచినా అక్రమాలపై ఉక్కుపాదం ఎక్కడ.?..**

పటాన్‌చెరు జూన్ 4 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు మండలంలోని చిన్న కంజర్ల, పెద్ద కంజర్ల, ఇంద్రేశం, రామేశ్వరం బండ ప్రాంతాల్లో కొనసాగుతున్న అక్రమ ఇటుక బట్టీల వ్యవహారం రోజురోజుకూ మరింత వివాదాస్పదంగా మారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నడుస్తున్నాయని పటాన్చెరు మండలం తహసిల్దార్ గుర్తించి నోటీసులు జారీ చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు లేకపోవడం వెనుక అసలు కారణం ఏమిటనే ప్రశ్నలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ, గనులు, కాలుష్య నియంత్రణ, విద్యుత్, కార్మిక శాఖల అనుమతులు లేకుండానే కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన రుసుములు, పన్నులు, అనుమతి ఫీజులు ఎగ్గొట్టబడితే ఆ నష్టం ఎవరికి లాభంగా మారుతోంది.? ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన ఆదాయం ఎవరి జేబుల్లోకి వెళ్తోందనే చర్చ స్థానికంగా తీవ్రంగా సాగుతోంది.



స్థానికుల ఆరోపణల ప్రకారం, అక్రమ ఇసుక వినియోగం, విద్యుత్ చౌర్యం, అనుమతులు లేని బోర్లు, పర్యావరణ నిబంధనల ఉల్లంఘనలు వంటి అంశాలు చాలాకాలంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు పెద్దగా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇప్పుడు ఫిర్యాదులు, తనిఖీలు, నోటీసులు అన్నీ పూర్తయిన తర్వాత కూడా చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమాలు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

తహసిల్దార్ హరిబాబు, నోటీసులు కూడా ఇచ్చారు. మరి చర్యలు ఎందుకు లేవు.? అనే ప్రశ్న ప్రజల నుంచి వినిపిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు ఎందుకు నమోదు కాలేదు.? బట్టీలను ఎందుకు సీజ్ చేయలేదు.? జరిమానాలు ఎందుకు విధించలేదు.? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు.

ఈ వ్యవహారంలో ప్రభావశీలుల అండదండలు ఉన్నాయా.?రాజకీయ ఒత్తిళ్లు పనిచేస్తున్నాయా.? లేక శాఖల మధ్య సమన్వయ లోపమే కారణమా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎక్కడో ఒకచోట వెనక్కి తగ్గుతున్నారనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది. ఇటుక బట్టీల వ్యవహారం కేవలం అనుమతుల ఉల్లంఘనకే పరిమితం కాదని, ప్రభుత్వ ఆదాయం, పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణ, బాల కార్మికుల సంక్షేమం వంటి అనేక అంశాలతో ముడిపడి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా చర్యలు ఆలస్యం కావడం వెనుక ఏదైనా అదృశ్య హస్తం పనిచేస్తోందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

ప్రజల ప్రశ్న ఒక్కటే..అక్రమాలు జరిగాయని నిర్ధారణ అయిన తర్వాత కూడా తహసిల్దార్ హరిబాబు, ఎందుకు మౌనంగా ఉన్నారు.? నోటీసులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా.? లేక నిజంగానే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయా.? జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే అక్రమాలు నిర్ధారణ. చర్యలు శూన్యం అనే ముద్ర అధికార యంత్రాంగంపై పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. నోటీసులు ఇచ్చారు..ఇక చర్యలు ఎప్పుడు.? తహసిల్దార్ హరిబాబు జారీ చేసిన నోటీసుల తర్వాత కూడా అక్రమ ఇటుక బట్టీల వ్యవహారంలో స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల హెచ్చరికలు అమలవుతాయా.? లేక అక్రమార్కుల ఒత్తిళ్లకు చర్యలు నిలిచిపోతాయా.? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదాస్పద వ్యవహారంలో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే..




# ఉప్పల్‌కు సీఎం రేవంత్ రెడ్డి..

## రూ.99 కోట్ల మెగా ప్రాజెక్ట్‌కు 7న శ్రీకారం!

మేడ్చల్/ఉప్పల్ జూన్ 4(ప్రజాకలం న్యూస్)

ఉప్పల్ ప్రాంత ప్రజలకు మరో శుభవార్త అందింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలోని ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలను అందించేందుకు ఉప్పల్ భగాయత్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన నూతన కార్యాలయ భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూమిపూజ కార్యక్రమం ఈ నెల 7వ తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగనుండటం విశేషం. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా భావిస్తున్న ఈ నిర్మాణం ద్వారా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు శాశ్వత పరిపాలనా కేంద్రం అందుబాటులోకి రానుంది. ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 99 కోట్ల నిధులను కేటాయించినట్లు సమాచారం. ఆధునిక వాస్తు శైలిలో, అత్యాధునిక సదుపాయాలతో నిర్మించబడనున్న ఈ కార్యాలయం మూసీనది ఒడ్డున ప్రత్యేక ఆకర్షణగా



నిలవనుంది. ప్రజలకు అందించే సేవలను మరింత వేగవంతం చేయడం, పరిపాలనా వ్యవస్థను ఒకేచోట కేంద్రీకరించడం, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు. భవనం పూర్తయిన తర్వాత మున్సిపల్ సేవలు మరింత సులభంగా ప్రజలకు చేరుకునే అవకాశం ఉంటుంది.

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి చేసిన ప్రయత్నాల ఫలితంగానే ఈ ప్రాజెక్ట్‌కు ఆమోదం లభించిందని స్థానిక నాయకులు, ప్రజలు పేర్కొంటున్నారు. గత కొంతకాలంగా ఉప్పల్ ప్రాంతంలో మున్సిపల్ పరిపాలనను బలోపేతం చేయాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాలయ భవనం అవసరమని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదించడంతో పాటు నిర్మాణానికి అవసరమైన నిధులను కూడా మంజూరు చేసింది. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఎంఎంసి నూతన భవన నిర్మాణం కల సాకారం కానుంది.

పరమేశ్వర్ రెడ్డి కృషితో సాకారమైన ప్రాజెక్ట్

ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "ఉప్పల్ అభివృద్ధికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం. ఉప్పల్ భగాయత్‌లో ఎంఎంసి కార్యాలయ భవనం నిర్మాణం మన ప్రాంతానికి గర్వకారణం. ఇది కేవలం ఒక భవనం మాత్రమే కాదు, ప్రజలకు మరింత చేరువయ్యే పరిపాలనకు నాంది. ఉప్పల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం" అని తెలిపారు. స్థానిక ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. మున్సిపల్ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, అన్ని సేవలు ఒకే చోట లభించడం వల్ల ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. జూన్ 7న జరగనున్న భూమి పూజ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ కార్యక్రమం ఉప్పల్ అభివృద్ధి చరిత్రలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలవనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


# మేళ్ల చెరువుపై కబ్జాల కన్నం

**-మేళ్ల చెరువు కట్టపై కబ్జాల పంజా..**
**-రక్షిత ప్రాంతంలో మట్టి మాఫియా..**
**-చూసీ చూడనట్టే అధికారులు.!**
**-ప్రమాద ఘంటిక మోగిస్తున్న మేళ్ల చెరువు..**

పటాన్ చేరు జూన్ 4 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్ చేరు రామచంద్రపురం మండలం జి హెచ్ ఎం సి తెల్లాపూర్ పరిధిలోని మేళ్ల చెరువు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న భూకబ్జాల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది. చెరువు రక్షణ కోసం గతంలో ప్రత్యేకంగా కేటాయించిన రక్షిత ప్రాంతాన్ని కొందరు అక్రమార్కులు క్రమంగా ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెరువు కట్టకు ఆనుకుని భారీగా మట్టి, మొరం పోస్తూ రక్షిత ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువులో నీటి మట్టం పెరిగిన సమయంలో కట్టపై అధిక ఒత్తిడి ఏర్పడితే ప్రమాదాలను నివారించేందుకు కట్ట వెనుక భాగంలో ప్రత్యేక రక్షణ ప్రాంతాన్ని గత పాలకులు ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. కట్టకు ఏదైనా నష్టం వాటిల్లినప్పుడు మరమ్మతు పనులు చేపట్టేందుకు, యంత్రాలు సంచరించేందుకు, అత్యవసర చర్యలు చేపట్టేందుకు ఈ ప్రాంతాన్ని ఖాళీగా ఉంచాలనే నిబంధనలు ఉన్నాయని పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం ఆ రక్షిత ప్రాంతంలోనే భారీగా మట్టి, మొరం నింపుతూ భూకబ్జాలకు తెరలేపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు కట్టకు అతి సమీపంలోనే భూమి ఎత్తు పెంచడం వల్ల భవిష్యత్తులో కట్ట బలహీనపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ భారీ వర్షాలు కురిసి చెరువులో నీటి ఒత్తిడి పెరిగితే కట్ట దెబ్బతినే పరిస్థితులు ఏర్పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు చెరువులు, వరద నీటి మార్గాలు, రక్షిత ప్రాంతాల్లో బహిరంగంగా మట్టి నింపుతున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలు జరుగుతున్న ప్రాంతాలను స్థానికులు పలుమార్లు చూపించినప్పటికీ చర్యలు కనిపించడం లేదని మండిపడుతున్నారు. చెరువును కాపాడాల్సిన వారే మౌనంగా ఉంటే బాధ్యత ఎవరిది.? రక్షిత ప్రాంతాలను కబ్జా చేస్తున్న అక్రమార్కులకు అండగా నిలుస్తున్నది ఎవరు.? చెరువు భద్రత కంటే భూకబ్జాదారుల ప్రయోజనాలే ముఖ్యమా.?అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో చెరువు కట్టల రక్షణకు వెంటనే చర్యలు తీసుకోవాలని, అక్రమంగా మట్టి నింపిన ప్రాంతాలను పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యత వహించాల్సింది సంబంధిత శాఖలేనని హెచ్చరిస్తున్నారు. చెరువుల రక్షణలో నిర్లక్ష్యం కొనసాగితే అది కేవలం భూకబ్జా వ్యవహారంగా కాకుండా ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది..





Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com